# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 8

ఆదివారం, 16 జూన్, 2024

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## ఎస్‌హెచ్‌జీలకు రూ.20 వేల కోట్లు

**బ్యాంక్ లింకేజీ వార్షిక రుణ ప్రణాళిక ఆవిష్కరించిన మంత్రి సీతక్క**

**హైదరాబాద్:** 2024-25లో రాష్ట్రంలోని 3,56,273 స్వయం సహాయక మహిళా సంఘాలకు (ఎస్‌హెచ్‌జీ) రూ. 20,000.39 కోట్లు అందించే లక్ష్యంగా బ్యాంక్ లింకేజీ వార్షిక రుణ ప్రణాళికను పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆవిష్కరించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ- గ్రామీణాభివృద్ధి సంస్థ ఎస్‌హెచ్‌జీ-బ్యాంక్ లింకేజి వార్షిక ఋణ ప్రణాళికలో భాగంగా శనివారం దీనిని విడుదల చేశారు. ఎస్‌హెచ్‌జీ వార్షిక ఋణ ప్రణాళికను ఆవిష్కరించిన అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ - 2వ పేజీలో

# కమిషన్ నుంచి తప్పుకోండి

## మీ విచారణలో నిష్పాక్షికత కనిపించడం లేదు

## 'విద్యుత్' కమిషన్ చైర్మన్ జస్టిస్ నరసింహారెడ్డికి మాజీ సీఎం కేసీఆర్ లేఖ

- **రాజకీయ కక్షతోనే కాంగ్రెస్ విచారణ కమిషన్**
- **నన్ను అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నాలు**
- **వ్యతిరేక రిపోర్టు ఇవ్వాలన్నదే మీ అభిప్రాయం**
- **పరిధి దాటి వ్యవహరిస్తూ బద్నాం చేస్తున్నారు**
- **మీ తీరు సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం**
- **15లోగా హాజరై సమాధానం ఇవ్వాలనుకున్నా**
- **నిష్పక్షపాతంగా విచారణ జరగట్లేదని వ్యాఖ్య**

**హైదరాబాద్:** విద్యుత్ అంశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్ విచారణలో నిష్పాక్షికత కనిపించడం లేదని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఆరోపించారు. విచారణ బాధ్యతల నుంచి స్వచ్ఛందంగా వైదొలగాలని కమిషన్ చైర్మన్ జస్టిస్ నరసింహారెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాజకీయ కక్షతో గత ప్రభుత్వాన్ని, తనను అప్రతిష్ట పాలు చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఎంక్వైరీ కమిషన్ ఏర్పాటు చేసిందని విమర్శించారు. ఈ మేరకు కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ జస్టిస్ నరసింహారెడ్డికి శనివారం సుదీర్ఘ లేఖ రాశారు. ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలు, యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై వివరణ ఇవ్వాలని కేసీఆర్‌ను గతంలో ఎంక్వైరీ కమిషన్ కోరింది. దీనికి కమిషన్ ఇచ్చిన గడువు శనివారంతో ముగుస్తున్న నేపథ్యంలో కేసీఆర్ ఈ లేఖ రాశారు. అందులో పేర్కొన్న వివరాలు ఆయన మాటల్లోనే.. "విద్యుత్ రంగంలో గణనీయ మార్పు చూపించిన మా ప్రయత్నాన్ని తక్కువ చేసి చూపించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. విచారణ కమిషన్ చైర్మన్‌గా మీడియా సమావేశంలో మీరు (జస్టిస్ నరసింహారెడ్డి) ఇష్టం వచ్చినట్టు మాట్లాడటం నాకెంతో బాధ కలిగించింది. మీ పిలుపు మేరకు లోక్‌సభ ఎన్నికల తర్వాత 2024 జూన్ 15లోగా నా అభిప్రాయాలను మీకు సమర్పించాలని అనుకున్నాను. కానీ ఒక ఎంక్వైరీ కమిషన్ సంప్రదాయాలకు విరుద్ధంగా, విచారణ పూర్తికాక ముందే మీరు మీడియా సమావేశం పెట్టి నా పేరును ప్రస్తావించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నేను వ్యవధి అడిగితే దాన్ని కూడా ఏదో దయతలచి ఇచ్చినట్టు మాట్లాడటం నాకెంతో బాధ కలిగించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి రిటైరైనప్పటికీ మీ తీరు సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఉంది. విచారణ పూర్తికాక ముందే తీర్పు ప్రకటించినట్టుగా మీ మాటలున్నాయి. మీ విచారణలో నిష్పాక్షికత ఎంత మాత్రం కనిపించడం లేదు. అందువల్ల ఇప్పుడు నేను మీ ముందు హాజరై ఏం చెప్పినా ప్రయోజనం ఉండదని స్పష్టమవుతున్నది.

### చట్టవిరుద్ధంగా ఎంక్వైరీ కమిషన్ ఏర్పాటు..

విచారణ ఒక పవిత్రమైన బాధ్యత, మధ్యవర్తిగా నిలిచి నిజాన్ని నిగ్గుతేల్చాల్సిన విధి. అన్ని విషయాలను సమగ్రంగా పరిశీలించి పూర్తి నిర్ధారణకు వచ్చిన తర్వాత, డాక్యుమెంటరీ సాక్ష్యాలతో బాధ్యులకు మాత్రమే నివేదిక ఇవ్వాల్సిన గురుతరమైన పని. కానీ మీ వ్యవహారశైలి అలా లేదని చెప్పేందుకు చింతిస్తున్నాను. ఎంక్వైరీ కమిషన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా రిపోర్టు ఇవ్వాలనే అభిప్రాయంతోనే మీరు మాట్లాడుతున్నట్టు స్పష్టమవుతోంది. ఇప్పటికే తప్పు జరిగిందని, తద్వారా జరిగిన ఆర్థిక నష్టాన్ని లెక్కించడం మాత్రమే మిగిలి ఉందన్నట్టుగా మీ మాటలు ఉంటున్నాయి. రాష్ట్రంలో జరిగిన రాజకీయ మార్పులతో సీఎంగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి.. గత ప్రభుత్వానికి దురుద్దేశాలు ఆపాదిస్తూ అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రాలపై చర్చలు కూడా జరిగాయి. అంతటితో ఆగకుండా ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ సంస్థలు వెలువరించిన తీర్పులపై విచారణ జరపకూడదనే ఇంగితం లేకుండా రేవంత్‌రెడ్డి ఎంక్వైరీ కమిషన్ ఏర్పాటు చేశారు. హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన మీరు ఎంక్వైరీ కమిషన్ ఏర్పాటు చట్టవిరుద్ధమని సూచించకుండా బాధ్యతలు స్వీకరించడం విచారకరం. అయినా చట్టవిరుద్ధంగా విచారణ ప్రారంభించి జూన్ 11న మీడియా సమావేశంలో మీరు అసంబద్ధ వ్యాఖ్యలు చేశారు.


### విచారణ అర్హత కోల్పోయారు.. విరమించుకోండి

భద్రాద్రి పవర్ ప్లాంటును రెండేళ్లలో పూర్తి చేస్తామనే బీహెచ్‌ఈఎల్ లిఖిత పూర్వక - 2వ పేజీలో



# బరాజ్‌లు కట్టిన సబ్ కాంట్రాక్టర్లు ఎవరు?

- **వివరాలివ్వాలని నిర్మాణ సంస్థలను కోరిన జస్టిస్ చంద్రఘోష్ కమిషన్**
- **ఇవ్వకుంటే వాటి పదేళ్ల ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్ల ఆడిటింగ్‌కు నిర్ణయం**
- **15 మంది సబ్ కాంట్రాక్టర్లకు పనులు అప్పగించినట్టు ఆరోపణలు**
- **బరాజ్‌ల సాంకేతిక అంశాలపై తుది అంకానికి చేరిన విచారణ ప్రక్రియ**
- **అఫిడవిట్ల సమర్పణకు 27తో కమిషన్‌కు ముగియనున్న గడువు**
- **అఫిడవిట్ల పరిశీలన తర్వాత మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌ను విచారణకు పిలిచే అవకాశం**
- **న్యాయమూర్తులు అన్ని ఆధారాలను పరిశీలించక ముందే ఓ నిర్ణయానికి రాబోరని స్పష్టం చేసిన జస్టిస్ పినాకి చంద్రఘోష్**



**హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను కాంట్రాక్టులు దక్కించుకున్న నిర్మాణ సంస్థలే నిర్మించాయా? లేక కాంట్రాక్టు నిబంధనలను విరుద్ధంగా సబ్ కాంట్రాక్టర్లకు పనులు అప్పగించాయా? అనే అంశంపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఆరా తీస్తోంది. మూడు బరాజ్‌ల నిర్మాణ పనుల్లో కనీసం 15 మంది సబ్ కాంట్రాక్టర్లు పాల్గొన్నట్టు కమిషన్‌కు కొందరు ఆధారాలు సమర్పించినట్టు సమాచారం. గత ప్రభుత్వంలో ముఖ్యమైన పదవిలో ఉన్న ఓ నేత దగ్గరి బంధువుకి సంబంధించిన ఓ కంపెనీ సైతం బరాజ్‌ల పనులను సబ్ కాంట్రాక్టుగా తీసుకుని నిర్వహించినట్టు తెలిసింది. దీంతో సబ్ కాంట్రాక్టర్ల వివరాలను సమర్పించాలని బ్యారేజీల నిర్మాణ సంస్థలను కమిషన్ ఆదేశించింది. సబ్ కాంట్రాక్టర్ల వివరాలను నిర్మాణ సంస్థలు సమర్పించకుంటే.. గత పదేళ్ల ఫైనాన్షియల్ స్టేట్మెంట్లను సమర్పించాలని నిర్మాణ సంస్థలను కమిషన్ ఆదేశించనుంది. నిర్మాణ సంస్థలు అనుమానిత సబ్ కాంట్రాక్టర్లకు డబ్బులను చెల్లించినట్టు ఈ ఫైనాన్షియల్ స్టేట్మెంట్లలో ఉండే అవకాశముంది. ఫైనాన్షియల్ స్టేట్మెంట్లను సైతం నిర్మాణ సంస్థలు సమర్పించని పక్షంలో కేంద్ర పరిశ్రమల శాఖ నుంచి ఆ వివరాలను తెప్పించుకోవాలని నిర్ణయించినట్టు తెలిసింది.

### మేడిగడ్డ నిర్ణయం కేసీఆర్‌దే..

తుమ్మిడిహెట్టికి బదులు మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మించాలనే నిర్ణయం నాటి సీఎం కేసీఆర్‌దేనని జస్టిస్ చంద్రఘోష్‌కి రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ - 2వ పేజీలో

# నాణ్యత ప్రమాణాలు లేకుంటే సీజ్ చేయాల్సిందే

- ఫుడ్ బిజినెస్ ఆపరేటర్స్‌పై నిరంతర నిఘా ఉంచాలి
- రాష్ట్రవ్యాప్తంగా రోజుకు 2 వందల శాంపిల్స్ సేకరించి పరీక్షించాలి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర



**హైదరాబాద్:** రాష్ట్రంలో నాణ్యత, ప్రమాణాలు పాటించకుండా ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. నాణ్యత లేకుండా ఇష్టానుసారంగా నిర్వహించే ఫుడ్ యూనిట్లను ఏమాత్రం సంకోచం లేకుండా సీజ్ చేయాలన్నారు. రాష్ట్రంలో ఫుడ్ బిజినెస్ ఆపరేటర్స్ తప్పకుండా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ యాక్ట్-2006కు లోబడి నిర్వహించాలన్నారు. శనివారం సచివాలయంలోని తన చాంబర్‌లో మంత్రి రాజనర్సింహ ఫుడ్ సేఫ్టీ అంశంపై సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు ఆదేశాలు, సూచనలు ఇచ్చారు. నాణ్యత ప్రమాణాలతో కూడిన ఆహార పదార్థాలను విక్రయించి ఇతర రాష్ట్రాలతో తెలంగాణ ఆదర్శంగా ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆహార తనిఖీ బృందాలు నిరంతరం ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తూనే ఉండాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ ఫుడ్ లాబ్స్ ద్వారా రోజుకు 180 నుంచి 200 ఫుడ్ శాంపిల్స్ సేకరించి పరీక్షలు నిర్వహించాలని, ఏమాత్రం లోపాలు గుర్తించినా వెంటనే - 2వ పేజీలో

# ఎఫ్‌ఎం ద్వారా ట్రాఫిక్ అలర్ట్‌లు

- **ఓఆర్ఆర్ యూనిట్‌గా విపత్తు నిర్వహణ**
- **అక్కడి సీసీ కెమెరాలన్నీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం**
- **వర్షాకాలంలో చేపట్టాల్సిన చర్యలపై పోలీసు అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం**




**హైదరాబాద్:** ఔటర్ రింగ్ రోడ్డుకు లోపల ఉన్న నగరాన్ని ఓ యూనిట్‌గా తీసుకొని విపత్తు నిర్వహణ వ్యవస్థను పటిష్ఠంగా రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. శనివారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సీఎం సందర్శించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు. ఓఆర్ఆర్‌పై ఉన్న సీసీ కెమెరాలన్నింటినీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఇక్కట్లు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎఫ్‌ఎం రేడియో ద్వారా ట్రాఫిక్ అలర్ట్‌లు చెబుతూ ప్రజలను అప్రమత్తం చేసే ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన మేరకు హోంగార్డుల నియామకాలు చేపట్టాలని పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో వరద తీవ్రత ఎక్కువగా ఉండే 141 ప్రాంతాలను ఇప్పటికే గుర్తించామని పోలీసు అధికారులు వెల్లడించారు. వరద నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టినట్లు వివరించారు. రోడ్లపై నీరు నిలవకుండా వాటర్ హార్వెస్ట్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎంకు తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఉన్నారు.

# ఆగస్టు 1 నుంచి భూముల విలువ పెంపు

- **ఈనెల 18 నుంచి పెంపు ప్రక్రియ మొదలు...**
- **జూలై 24న తుది ఆమోదం...**
- **అభ్యంతరాల నమోదుకు ప్రజలకు 15 రోజుల గడువు**
- **జాతీయ,రాష్ట్ర రహదారులు వెళ్లే గ్రామాలకు ప్రాధాన్యం**
- **మున్సిపాలిటీల్లో కలిసిన గ్రామాల విషయంలో క్షేత్రస్థాయి వాస్తవాల ఆధారంగా విలువలు**



**హైదరాబాద్:** ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి రాష్ట్రంలోని భూములు, ఆస్తులకు కొత్త ప్రభుత్వ విలువలు అమల్లోకి రానున్నాయి. ఈనెల 18 నుంచి ప్రభుత్వ విలువల సవరణ ప్రక్రియ ప్రారంభం కానుండగా, జూలై 31 నాటికి పూర్తి కానుంది. అనంతరం ఆగస్టు 1 నుంచి కొత్త ప్రభుత్వ విలువల ప్రకారం రాష్ట్రంలోని వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరగనున్నాయి. భూములు, ఆస్తుల విలువలను మరోమారు సవరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఇందుకు - 2వ పేజీలో

# విత్తన కంపెనీల టార్గెట్‌పై విజిలెన్స్

## కంపెనీల వారీగా నిర్దేశించిన లక్ష్యం, పురోగతిపై తనిఖీలు నిర్వహిస్తాం: తుమ్మల

**ఫలితాలివ్వని ఆయిల్‌పామ్ కంపెనీలకు నోటీసులు ఇవ్వాలని ఆదేశాలు**



**హైదరాబాద్:** ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రంలోని విత్తన కంపెనీలు విత్తనాలను సరఫరా చేయాల్సిందేనని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. విత్తన కంపెనీలకు నిర్దేశించిన లక్ష్యాల సాధనను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆయన - 2వ పేజీలో


## విలేకరులు కావలెను

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం

వాయిస్ టుడే న్యూస్ చానల్ మరియూ డిజిటల్ పేపర్ లో యాంకర్స్ మరియు వీడియో ఎడిటర్స్, గ్రాఫిక్ డిజైనర్, నియోజకవర్గాల వారీగా రిపోర్టర్స్ కావలెను.

ఆసక్తి కలిగిన వారు ఈ నంబర్ **7386416560** లో సంప్రదించగలరు.

**వాయిస్ టుడే యాజమాన్యం**

# కమిషన్ నుంచి తప్పుకోండి

మొదటి పేజీ తరువాయి

హామీ మేరకు పనులు అప్పగించాం. ఎన్జీటీ స్టే, కరోనాతో కలిగిన అంతరాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఆలస్యానికి ప్రభుత్వానిదే బాధ్యత అన్నట్టుగా మీరు మాట్లాడారు. ఉభయ రాష్ట్రాల మధ్య ఒప్పందాలను ఎస్ఈఆర్సీ పరిశీలించకూడదని, అందులో ఏదో తప్పు జరిగిందనే భావన కలిగేలా మాట్లాడారు. న్యాయ నిపుణులైన మీరు చట్టాల్లో పొందుపరచబడిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోకుండా న్యాయ ప్రాధికార సంస్థలపై వ్యాఖ్యానాలు చేశారు. దీంతో ఈ వ్యవహారంపై మీరు విచారణార్హత కోల్పోయినందున ఈ బాధ్యతల నుంచి విరమించుకోవాలి. తమిళనాడు, కర్నాటక టెండర్ పద్ధతిలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకున్న మొత్తంతో పోలిస్తే ఛత్తీస్‌గఢ్ నుంచి నామినేషన్ పద్ధతిలో తెలంగాణ కొనుగోలు చేసిన యూనిట్ విద్యుత్ ధర తక్కువ. కానీ ఎక్కువ ధర చెల్లించారని మీరు చెప్పినందున విచారణ అర్హత కోల్పోయారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలన్నీ (పీపీఏ) ప్లాంట్ల నిర్మాణం ప్రారంభించడానికి ముందే జరుగుతాయన్న వాస్తవాన్ని విస్మరించారు. భద్రాద్రి సబ్ క్రిటికల్ థర్మల్ స్టేషన్ నిర్మాణం విజయవంతంగా పూర్తి చేసినా అప్పటి ప్రభుత్వం ఏదో తప్పు చేసిందనే దురుద్దేశాలు ఆపాదించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంటు నిర్మాణానికి ప్రాంతీయ మౌలిక సదుపాయాల సమతుల్యత, ఆర్థికాభివృద్ధి, లోడ్ డిస్ట్రిబ్యూషన్, విద్యుత్ సరఫరా నష్టాలు తగ్గించడం, విపత్తుల నివారణ (డీ రిస్కింగ్) అనేవి కూడా ప్రధాన ప్రాతిపదికలుగా ఉంటాయనే వాస్తవాన్ని విస్మరించారు. ప్రాజెక్టు సకాలంలో పూర్తికాలేదని చెప్పడం అసమంజసం.

# బరాజ్‌లు కట్టిన సబ్ కాంట్రాక్టర్లు ఎవరు?

మొదటి పేజీ తరువాయి

తెలిపింది. గోదావరిపై నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టులపై అధ్యయనం కోసం రిటైర్డ్ సీఈలు బి.అనంతరాములు, వెంకటరామారావు, ఎస్.చంద్రమౌళి, రిటైర్డ్ ఎస్ఈలు జి.దామోదర్ రెడ్డి, ఎం.శ్యామ్‌ప్రసాద్ రెడ్డితో 2015లో నాటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కమిటీని శనివారం జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ బీఆర్‌కేఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో విచారించింది. శ్యామ్‌ప్రసాద్ రెడ్డి మినహా మిగిలిన ఇంజనీర్లు కమిషన్ ముందు హాజరై తమ అభిప్రాయాలను తెలియజేశారు. మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ తాము నివేదిక సమర్పించగా.. దానిని నాటి సీఎం కేసీఆర్, ఇరిగేషన్ మంత్రి హరీశ్ రావు తిరస్కరించారని, వాటిపై సంతకాలు సైతం చేయలేదని వివరించారు. కేసీఆర్ సూచనల మేరకే మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మించినట్టు తెలిపారు. మహారాష్ట్రను ఒప్పించి తుమ్మిడిహెట్టి వద్ద 150%-%151 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మించాలని సిఫారసు చేస్తూ అప్పట్లో సమర్పించిన ఈ నివేదిక ప్రతిని కమిషన్‌కు అందజేశారు.

**27 తర్వాత కేసీఆర్, హరీశ్‌ను పిలిచే అవకాశం**

బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలపై జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ నిర్వహిస్తున్న విచారణ తుది అంకానికి చేరింది. బరాజ్‌ల నిర్మాణంతో సంబంధం ఉన్న ఈఎన్సీ నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి వరకు అధికారులందరినీ ఆయన పిలిపించి ప్రశ్నించారు. నిర్మాణ సంస్థల ప్రతినిధులు, ఇతర రిటైర్డ్ ఇంజనీర్లను సైతం ప్రశ్నించారు. విచారణలో పేర్కొన్న అంశాలను ఈ నెల 27లోగా అఫిడవిట్ రూపంలో సమర్పించాలని వారందరినీ ఆదేశించారు. అఫిడవిట్ల పరిశీలన పూర్తైన తర్వాత తదుపరిగా ఎవరెవరిని విచారించాలన్న అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈ క్రమంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావుతో పాటు బ్యారేజీల డీపీఆర్‌లను ఆమోదించిన కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) ఇంజనీర్లు, ఇతర అధికారులను సైతం పిలిపించి విచారించే అవకాశముంది. తదుపరి దశలో బహిరంగ విచారణ నిర్వహించి.. అఫిడవిట్లలో వివిధ వ్యక్తులు సమర్పించిన సమాచారం ఆధారంగా క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించేందుకు కమిషన్ సిద్ధమవుతోంది.

# నాణ్యత ప్రమాణాలు లేకుంటే సీజ్ చేయాల్సిందే

మొదటి పేజీ తరువాయి

సీజ్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ హాస్టల్స్, ప్రైవేటు బోర్డింగ్ రెసిడెన్షియల్ స్కూల్స్, బేకరీలు, డెయిరీ ఫుడ్ తయారీదారులు, రెస్టారెంట్లు, హోటళ్లు, ప్యాకేజ్డ్ ఫుడ్ యూనిట్లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిని ఉపేక్షించేది లేదని మంత్రి హెచ్చరించారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ యాక్ట్ ప్రకారం నాణ్యత ప్రమాణాలు పాటించని వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల పనితీరుపై మంత్రి దామోదర తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు ప్రతి శనివారం మొబైల్ ఫుడ్ లాబ్స్ ద్వారా చేపట్టిన పరీక్షల వివరాల నివేదికను తనకు అందించాలన్నారు. ఫుడ్ సేఫ్టీపై ఫుడ్ బిజినెస్ ఆపరేటర్స్‌తో అవగాహన సదస్సులను నిర్వహించాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఐపీఎం డైరెక్టర్ డాక్టర్ శివలీల, స్టేట్ ఫుడ్ ల్యాబ్స్ హెడ్ లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌హెచ్‌జీలకు రూ.20 వేల కోట్లు

మొదటి పేజీ తరువాయి

ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.20 వేల కోట్లకు వార్షిక రుణ ప్రణాళికతో పాటు అదనంగా 2,25,000 మహిళలకు వివిధ జీవనోపాధి కార్యక్రమాల నిమిత్తం రూ.4,500 కోట్లు బ్యాంకుల నుంచి సహాయం అందించనున్నట్టు తెలియజేశారు. మహిళాశక్తి క్యాంటీన్లను త్వరలోనే ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం వచ్చాక మహిళల ఆర్థిక అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనివ్వడంతో పాటు బ్యాంకుల ద్వారా వ్యక్తిగత రుణాలు ఇప్పిస్తున్నట్టు తెలిపారు. మహిళా సంఘాలకు ఏ పూచీకత్తు లేకుండా ఇతోధికంగా ఋణాలు అందిస్తున్నందుకు మహిళల తరపున, ప్రభుత్వం తరపున బ్యాంకు అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. సమావేశంలో పీఆర్‌శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, నాబార్డ్ సీజీఎం సుశీల చింతల తదితరులుపాల్గొన్నారు. ం

# 20 జిల్లాలకు కొత్త కలెక్టర్లు..

## భారీగా ఐఏఎస్‌ల బదిలీలు ఒకటి, రెండు రోజుల్లో సీనియర్లకు స్థానచలనాలు.. ఐపీఎస్‌ల మార్పిడికి రంగం సిద్ధం

**హైదరాబాద్:** రాష్ట్రంలో 20 జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తంగా 30 మంది అధికారులకు స్థానచలనాలు జరిగాయి. ప్రస్తుతం కలెక్టర్లుగా పనిచేస్తున్న పది మందికి పోస్టింగ్‌లు ఇవ్వలేదు. త్వరలో సీనియర్ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల బదిలీలను పెద్దఎత్తున ప్రభుత్వం చేపట్టనుంది. ఎన్నికల ప్రక్రియ ముగిసినందున పరిపాలనాపరమైన అవసరాలు, ఆయా కలెక్టర్ల పనితీరు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం బదిలీలు, నియామకాలు జరిపింది. ఎన్నికలకు ముందు కలెక్టర్లుగా నియమితులైన వారిని బదిలీ చేసి అక్కడ కొత్తవారికి అవకాశం కల్పించింది. వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి సత్యశారదకు వరంగల్ జిల్లాకు కలెక్టర్‌గా, రోడ్లుభవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి బోయి విజయేంద్రకు మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా తొలిసారి ప్రభుత్వం అవకాశం కల్పించింది.

# పోడు భూముల పంపిణీపై నివేదిక ఇవ్వండి

**మంత్రి కొండా సురేఖ ఆదేశాలు**
**బీఆర్ఎస్ హయాంలో అనర్హులకు కేటాయించినట్టు ఆరోపణలు**
**కొత్తగా పోడు భూములు ఆధీనంలో తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**
**పోడు భూముల సమస్యపై సమీక్షా సమావేశం**
**హాజరైన మరో మంత్రి సీతక్క**



**హైదరాబాద్:** ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఏళ్ళుగా పోడు సాగు చేసుకుంటున్న రైతు కుటుంబాల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ భరోసానిచ్చారు. అయితే చట్టాలకు విరుద్ధంగా కొత్తగా పోడు భూములను ఆధీనంలోకి తీసుకున్నట్లయితే కఠినచర్యలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో అనర్హులకు పోడు భూముల కేటాయింపు జరిగిన విషయం తమ దృష్టికి వచ్చిన నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన పోడు భూముల పంపిణీపై నివేదికను సమర్పించాలని అటవీశాఖ ఉన్నతాధికారులను మంత్రి సురేఖ ఆదేశించారు. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం కాల్పోల్ గ్రామంలో ఎఫ్ ఆర్ఓ, సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్‌లపై గిరిజనులు చేసిన దాడిని మంత్రి ప్రస్తావించారు. పోడు సాగుచేసుకుంటున్న రైతు కుటుంబాలు అటవీశాఖ అధికారులకు ఎలాంటి హానీ తలపెట్టవద్దని, దాడులకు దిగితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శనివారం సచివాలయంలో మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో పోడు భూముల సమస్యలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క పాల్గొన్నారు. పోడు సమస్యకు పరిష్కారం వెదకాలని సీతక్క పలుమార్లు చెప్పగా, అదే విషయాన్ని మంత్రి కొండా సురేఖ ప్రస్తావిస్తూ ఏళ్ళుగా కొనసాగుతున్న పోడు భూముల చిక్కు సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు ఈ సమావేశాన్ని ప్రాథమిక సమావేశంగా భావిస్తున్నామని వ్యాఖ్యానించారు.

**ఛత్తీస్‌గఢ్ నుంచి వలసలను నివారించండి**

ఛత్తీసగఢ్ నుంచి రాష్ట్రంలోకి వస్తున్న గిరిజనులు అటవీ భూములను ఆక్రమించుకుంటున్న విషయాన్ని అధికారులు మంత్రులకు వివరించారు. దీనికి మంత్రులు స్పందిస్తూ, "పక్క రాష్ట్రాల నుంచి గిరిజనులు మన ప్రాంతానికి వస్తే ఇక్కడ ప్రజల ప్రయోజనాలు దెబ్బతింటాయి. భవిష్యత్‌లో ఇలాంటి వలసలు కొనసాగకుండా కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించి కచ్చితమైన మార్గదర్శకాలను రూపొందించాలి. ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాలు దెబ్బతినకుండా చూడాలి"అని అధికారులను ఆదేశించారు.

**అభివృద్ధి పనులు కొనసాగించండి: సీతక్క**

అటవీ ప్రాంతాల్లో కొత్తగా వెలుస్తున్న గ్రామాల్లో అభివృద్ధి పనులకు అటవీశాఖ అభ్యంతరాలు వ్యక్తం చేసినా, ఏళ్ళుగా కొనసాగుతున్న గ్రామాల్లో అభివృద్ధి పనులను కొనసాగించేలా అధికారులకు ఆదేశాలివ్వాలని మంత్రి కొండా సురేఖను మంత్రి సీతక్క కోరారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, పథకాల అమలులో అటవీశాఖ మార్గదర్శకాలు ప్రతిబంధకాలుగా మారుతున్న నేపథ్యంలో... ఈ దిశగా కేంద్రంతో సంప్రదింపులు జరిపి పోడు భూముల సమస్యపై పరిష్కారాన్ని రాబట్టేలా చర్యలు చేపట్టాలని కోరారు. అటవీ భూములను కాపాడుకుంటూనే, పోడు రైతులకు ప్రయోజనం కలిగేలా పోడు భూముల్లో ఉద్యానవన శాఖ మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలు చేపట్టి వారికి ప్రయోజనాలను కలిగించాలని ఆమె కోరారు. ఫారెస్ట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ద్వారా పలు రకాల మొక్కలను పెంచడం, పామాయిల్ చెట్ల సాగు వంటి చర్యల ద్వారా పోడు రైతులకు ప్రయోజనాలను కలిగించవచ్చని సురేఖ అధికారులకు సూచించారు.

# ఆగస్టు 1 నుంచి భూముల విలువ పెంపు

మొదటి పేజీ తరువాయి

అవసరమైన ప్రక్రియను పూర్తి చేసేందుకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విలువల నిర్ధారణకు అనుసరించాల్సిన పద్ధతులు, ఇరు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన ప్రాతిపదికలు, విలువల సవరణ ప్రక్రియ షెడ్యూల్‌తో కూడిన ఈ మార్గదర్శకాలను ఆ శాఖ కమిషనర్ నవీన్‌మిత్తల్ సంబంధిత అధికారులకు పంపారు. వీటి ప్రకారం సవరించిన విలువలను ప్రజలకు అందుబాటులో ఉంచి వారి అభిప్రాయాలు, అభ్యంతరాలు తీసుకునేందుకు 15 రోజులు గడువు ఇవ్వనున్నారు. ఈ అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాతే అధికారంగా కొత్త విలువలను నమోదు చేయనున్నారు.

**గ్రామీణ ప్రాంతాల్లో సవరణ ప్రక్రియ ఇలా...**

- వ్యవసాయేతర వినియోగానికి అనువుగా (ప్లాట్లు, ఇళ్ల నిర్మాణం, పరిశ్రమలు, సెజ్‌లు, వినోద సౌకర్యాల ఏర్పాటు) జాతీయ, రాష్ట్ర రహదారులకు ఆనుకుని ఉన్న గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల్లోని భూముల విలువను అధికంగా పెంచాలి.
- ఈ క్రమంలో గ్రామపటాలను తీసుకుని ఇప్పటికే ఇంటి స్థలాలుగా మారిన సర్వే నంబర్లు, మారే యోగ్యత ఉన్న సర్వే నంబర్లు, జాతీయ, రాష్ట్ర రహదారులకు ఆనుకుని ఉన్న సర్వే నంబర్లను వేర్వేరుగా గుర్తించాలి.
- సబ్‌రిజిస్ట్రార్, జిల్లాల రిజిస్ట్రార్లు ఈ గ్రామాలకు ప్రత్యేకంగా వెళ్లి సమాచారం సేకరించాలి. ఆయా గ్రామాల్లోని పెద్దలు, రెవెన్యూ పంచాయతీ అధికారులతో మాట్లాడి ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో భూములు, ఆస్తులకు ఉన్న విలువను గుర్తించాలి.
- బహిరంగ మార్కెట్ విలువలను సేకరించే విషయంలో ఎలాంటి తప్పులకు అవకాశం ఇవ్వొద్దు. రియల్ ఎస్టేట్ కంపెనీల బ్రోచర్లు, భూసేకరణ పరిహారం, బ్యాంకులు, రెవెన్యూ వర్గాలు నిర్వహించిన వేలం లాంటి వివరాలను విలువల నిర్ధారణకు వాడుకోవచ్చు. బహిరంగ మార్కెట్ విలువలను సేకరించిన తర్వాత ప్రస్తుతమున్న ప్రభుత్వ విలువలతో పోల్చుకుని సవరించాల్సిన విలువలను ప్రతిపాదించాలి.
- 5-6 కిలోమీటర్ల రేడియస్‌లోని గ్రామాల్లో ఉండే తేడాలను జాగ్రత్తగా గమనించాలి. ఆ వ్యాసార్థంలోని గ్రామాల్లో ఏ పాయింట్‌లో ఎంత విలువ ఉంది, ఏయే పాయింట్‌కు ఎంత మారుతోందనే అంశాలను జాగ్రత్తగా గమనించాలి. ఒకే గ్రామంలో ఉన్నా వేర్వేరు చోట్ల ఉన్న భూములు, ఆస్తులకు రెండు కంటే ఎక్కువ విలువలను కూడా ప్రతిపాదించవచ్చు. వ్యవసాయ భూముల విషయంలో ప్రస్తుత బహిరంగ మార్కెట్ విలువలను రెవెన్యూ, అధికారుల నుంచి తీసుకోవాలి.
- గతంలో పొరపాటుగా బహిరంగ మార్కెట్ విలువల కంటే ప్రభుత్వ విలువలను ఎక్కువగా నమోదు చేసి ఉంటే వాటిని వ్యక్తిగతంగా డీఐజీ స్థాయి అధికారులు పరిశీలించి కమిటీ ముందు పెట్టి నిర్ణయం తీసుకోవాలి. వ్యవసాయ భూముల విషయంలోనూ ఇదే వర్తిస్తుంది.

**పట్టణ ప్రాంతాల్లో ఇలా...**

- మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు అధికారికంగా నిర్ధారించిన ప్రాంతాల వివరాలను సేకరించి నివాస ప్రాంతాలు, వాణిజ్య ప్రాంతాలకు వేర్వేరుగా ఆ ప్రాంతం మొత్తానికి ఒకే విలువ నిర్ధారించాలి. సదరు ప్రాంతాల్లో కొన్ని కాలనీలు, వీధులను కలపాల్సి వచ్చినా విలువలు మాత్రం ఒకేలా ఉండాలి.
- రోడ్డుకిరువైపులా ఉన్న ఆస్తులకు ఒకే విలువ ప్రతిపాదించాలి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల నుంచి తాజా డోర్ నంబర్ల వివరాలను ఫామ్2లో పొందుపరచాలి.
- మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కొత్తగా విలీనం చేసిన గ్రామాల్లో విలువల ప్రతిపాదన కసరత్తు క్షేత్రస్థాయి పరిస్థితులకు తగినట్టు ఉండాలి. ఈ గ్రామాలను ఆనుకుని ఇప్పటికే వార్డులు, బ్లాక్‌లుగా ఉన్న మున్సిపల్ ప్రాంతాల్లో విలువలు ఆయా గ్రామాలకు సమీపంగా ఉంటే వాటిని పరిగణనలోకి తీసుకోవచ్చు.
- నివాస ప్రాంతాల్లో ఉన్న డోర్ నంబర్లను వాణిజ్య ప్రాంతాలుగా పొరపాటున నమోదు చేసినా, వాణిజ్య ప్రాంతాల డోర్ నంబర్లను నివాస ప్రాంతాలుగా నమోదు చేసినా వాటిని సవరించాలి.
- గ్రౌండ్ ఫ్లోర్, ఇతర ఫ్లోర్‌లకు వేర్వేరు విలువలు నిర్ధారించే అంశాన్ని కేవలం ప్రధాన రహదారుల పక్కన ఉండే నివాస సముదాయాలకు మాత్రమే వర్తింపజేయాలి.

**సాధారణ మార్గదర్శకాలు:**

- భారత స్టాంపుల చట్టం-1899లోని సెక్షన్ 47(ఏ) ప్రకారం ఆస్తుల విలువలను సవరించే సమయంలో క్రమానుగుణంగా జరిగిన ప్రక్రియ, విలువలను పరిగణనలోకి తీసుకుని సవరణ విలువలను ప్రతిపాదించాలి. (అంటే ఒకేసారి పెద్ద ఎత్తున పెంపు, తగ్గింపు ఉండకూడదు.) - గ్రామీణ ప్రాంతాల డేటా, రికార్డులను తహశీల్దార్లు, గ్రామపంచాయతీల నుంచి తీసుకోవాలి. ప్రస్తుతమున్న ప్రభుత్వ విలువల కంటే ఎక్కువ విలువలతో ఒక ప్రాంతంలో పలు లావాదేవీలు జరిగి ఉంటే ఆ విలువను సవరణకు ప్రాతిపదికగా తీసుకోవచ్చు.
- హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, యాదాద్రి, ఖమ్మం, సిద్దిపేట, కరీంనగర్, వరంగల్ పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో జోనల్ అభివృద్ధి మ్యాప్‌లను, మిగిలిన పట్టణ ప్రాంతాల్లో ఆయా ప్రాంతాల మాస్టర్‌ప్లాన్‌లను విలువల సవరణకు ప్రాతిపదికగా తీసుకోవాల్సి ఉంటుంది.

# మండలానికో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

## ఒక్కో పాఠశాల 20 నుంచి 25 ఎకరాల్లో ఏర్పాటు: భట్టి



**రాయదుర్గం:** రాష్ట్రంలో ప్రతీ మండలంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని సంకల్పించినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఒక్కో పాఠశాలను 20 నుంచి 25 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ప్రస్తుతం ఉన్న ఇంటర్నేషనల్ స్కూల్స్‌కు దీటుగా వీటిని అందుబాటులోకి తెస్తామని, వీటి ఏర్పాటుకు ఇప్పటికే బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించామని చెప్పారు. శనివారం ఆయన పుట్టినరోజును పురస్కరించుకొని శేరిలింగంపల్లిలోని గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలను సందర్శించి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. 'మిమ్మల్ని మీ తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారు. వారి ఆశలను తీర్చేందుకు ప్రభుత్వం ఎన్ని నిధులైనా వెచ్చించడానికి సిద్ధంగా ఉంది. ఈ ప్రభుత్వం మీపై పెట్టుకున్న కలలను నిజం చేయడానికి కష్టపడి చదువుకొని మీ లక్ష్యాలను సాధించండి'అని చెప్పారు.

**విద్యా, వైద్య రంగాల్లో సమూల ప్రక్షాళన**

విద్యా, వైద్యరంగాల్లో సమూల ప్రక్షాళన చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క చెప్పారు. గత ప్రభుత్వం మాదిరిగా ప్రజల సమస్యలను ఇందిరమ్మ రాజ్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం గాలికి వదిలేయదన్నారు. సంక్షేమం, విద్యకు బడ్జెట్ సమస్య కాదని, ఎన్ని నిధులైనా వెచ్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆడంబరాలకు పోయే నాయకులకు భిన్నంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిరాడంబరంగా విద్యార్థులతో కలిసి జన్మదిన వేడుకలను జరుపుకోవడం ముదావహమన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ కార్యదర్శి సీతాలక్ష్మి, సహకార్యదర్శి సక్రూనాయక్, రీజినల్ కోఆర్డినేటర్ శారద పాల్గొన్నారు.

**ఘనంగా భట్టి జన్మదిన వేడుకలు**

**హైదరాబాద్:** ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన జన్మదినం సందర్భంగా శనివారం ఉదయం నుంచే పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున ప్రజాభవన్‌కు తరలివచ్చారు. పోచమ్మ తల్లి ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**రేవంత్ శుభాకాంక్షలు**

ఉప ముఖ్యమంత్రి భట్టికి సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా 'భగవంతుడు మీకు ఆయురారోగ్యాలను, ప్రజలకు మరింత సేవచేసే శక్తిని ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'అని పోస్ట్ చేశారు.

# విత్తన కంపెనీల టార్గెట్‌పై విజిలెన్స్

మొదటి పేజీ తరువాయి

అధికారులను ఆదేశించారు. శనివారం మంత్రి చాంబర్‌లో వ్యవసాయ, సహకార శాఖల ఉన్నతాధికారులతో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తన ప్యాకెట్లు కంపెనీ నుంచి రైతులకు చేరే వరకు నిఘా వ్యవస్థ కట్టుదిట్టంగా పనిచేయాలని సూచించారు. పచ్చిరొట్ట విత్తనాల పంపిణీపై వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హరిత వివరిస్తూ రూ.61.15 కోట్లు విలువగల 1,09,937 క్వింటాళ్ళ విత్తనాలను రైతులకు అందచేశామని వివరించారు. గతేడాది జూన్15 నాటికి 64,34,215 పత్తి ప్యాకెట్లు రైతులకు అందుబాటులో ఉంచగా, ఈసారి 1,02,45,888 ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని, రైతులు ఇప్పటికే 62 లక్షల ప్యాకెట్లు కొనుగోలు చేశారని తెలిపారు. రాష్ట్రంలో 7,97,194 మెట్రిక్ టన్నుల యూరియా, 75,278 మెట్రిక్ టన్నుల డీఏపీ, 4,27,057 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 26,396 మెట్రిక్ టన్నుల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ ఎరువులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు వివరించారు.

**పంటల నమోదు పారదర్శకంగా ఉండాలి**

రాష్ట్రంలో పంటల నమోదు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని, ఎలాంటి లోపాలకు తావులేకుండా సజావుగా జరపాలని మంత్రి తుమ్మల సంబంధింత అధికారులను ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యాల మేర ఫలితాలు చూపని ఆయిల్ పామ్ కంపెనీలకు నోటీసులు ఇవ్వాలని ఉద్యానవన శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. డ్రిప్, స్ప్రింక్లర్స్ సౌకర్యం కేవలం ఆయిల్ పామ్ పంటలకే కాకుండా ఇతర పంటలకూ వర్తింపజేయాలని సూచించారు.

# 531 వైద్యుల పోస్టుల భర్తీకి త్వరలో ప్రకటన

హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు త్వరలో 531 సివిల్ అసిస్టెంట్ సర్జన్ (సీఏఎస్), 193 ల్యాబ్ టెక్నీషియన్లు, 31 స్టాఫ్ నర్సుల పోస్టులకు తెలంగాణ వైద్య ఆరోగ్య సేవల నియామక బోర్డు (ఎంహెచ్ఎస్ఆర్‌బీ) ఉద్యోగ ప్రకటనలు జారీ చేయనుంది. ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టిన ప్రభుత్వం వివిధ ఆస్పత్రులు, విభాగాల్లో ఖాళీలు గుర్తించి వెంటనే భర్తీచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ల కొరత ఎక్కువగా ఉందని గుర్తించిన వైద్య ఆరోగ్యశాఖ ఈ సమస్యను అధిగమించాలని నిర్ణయించింది. ఎక్కడెక్కడ ఖాళీ పోస్టులున్నాయో వివరాలు తీసుకున్న వైద్యఆరోగ్యశాఖ మొత్తం 531 పోస్టులను గుర్తించింది. ఈ పోస్టులను వెంటనే భర్తీచేసేందుకు నియామక ప్రకటన జారీ చేయనుంది. వైద్య పోస్టులతో పాటు 193 ల్యాబ్ టెక్నీషియన్లు, ఆసుపత్రుల్లో రోగులకు సేవలు అందించే 31 స్టాఫ్‌నర్సుల పోస్టులకు ఉద్యోగ ప్రకటనలు వెలువడనున్నాయి.

# కల్యాణ లక్ష్మి చెక్కుల అందజేత

## ప్రజాప్రభుత్వంలో మహిళలకు పెద్ద పీట


## ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం: జూన్ 15 (వాయిస్ టుడే) ఇబ్రహీంపట్నం ప్రజాభవన్ లో కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేసిన స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, శనివారం ఉదయం ఇబ్రహీంపట్నం ప్రజాభవన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 92 మంది కళ్యాణాలక్ష్మి లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదగా చెక్కులు అందజేయడం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం, పెళ్లయిన ఆడపిల్ల కుటుంబానికి లక్ష రూపాయల నగదుతో పాటు ఒక తులం బంగారం అందజేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన గ్యారంటీ పథకాల ద్వార మహిళలు అర్థకంగా ఎదుగుతారని, ప్రజా ప్రభుత్వంలో మహిళలకు పెద్ద పీట వేస్తామని, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి వెల్లడించారు. రాబోయే రోజుల్లో ప్రతి పథకం అమలు చేస్తామని చెప్పారు. ఏ ఇబ్బందులు వచ్చిన మీకు అందుబాటులో ఉంటానని తెలిపారు. గత ప్రభుత్వంలో దళారీ వ్యవస్థ ఉండేదని, ప్రజాప్రభుత్వంలో ప్రజల వద్దకే పాలన ఉంటుందని చెప్పారు. ప్రజా భవన్ లో ప్రతి బుధవారం అధికారులు ఇక్కడ ఉండడం జరుగుతుంది మీ సమస్యలు ఏమున్నా పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండలం, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ, ఆదిభట్ల మున్సిపాలిటీలోని కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులు, జడ్పిటిసి భూపతిగళ్ల మహిపాల్, ఇబ్రహీంపట్నం చైర్మన్ కప్పరి స్రవంతి, ఆదిభట్ల చైర్మన్ మరి నిరంజన్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### రంగారెడ్డి జిల్లా...

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ప్రజా భవన్ లో కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేసిన స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండలం, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ, ఆదిభట్ల మున్సిపాలిటీలోని కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులు, జడ్పిటిసి భూపతిగళ్ల మహిపాల్, ఇబ్రహీంపట్నం చైర్మన్ కప్పరి స్రవంతి, ఆదిభట్ల చైర్మన్ మరి నిరంజన్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, మండల, మున్సిపల్, గ్రామల ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## మానవాలి మనుగడకు మొక్కలే శ్రీరామ రక్ష...

### ఎమ్మెల్యే అరికెపుడి గాంధీ

శేరిలింగంపల్లి : జూన్ 15(వాయిస్ టుడే) శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలో సాయి వైభవ్ కాలనీ లో కాలనీ ప్రెసిడెంట్ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన హరిత వైభవోత్సవం కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సాయి బాబా తో కలిసి ఎమ్మెల్యే అరికేపుడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ సాయి వైభవ్ కాలనీ లో హరిత వైభవోత్సవం సందర్భంగా మొక్కలు నాటడం చాలా సంతోషకరమైన విషయని, సాయి వైభవ్ కాలనీ ఇక నుండి హరిత వైభవోత్సవంగా విరాజిల్లునని, ఇతర కాలనీ లకు ఆదర్శంగా నిలిచిందిని , రాబోయే రోజులలో కాలనీ మొత్తం పచ్చని మణిహారంగా మారునుందని, ఇంటికి, దేవుడికి ఉపయోగపడే అన్ని రకాల మొక్కలు నాటడం జరిగినదని , కాలనీ లో ప్రధాన రహదారికిరు వైపుల మరియు అంతర్గత రోడ్లలో మొక్కలు నాటడం జరిగినదని తెలిపారు, ఈ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి దోహదపడిన కాలనీ ప్రేసిడెంట్ పద్మావతికి మరియు కాలనీ వాసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎంతో గొప్ప కార్యక్రమని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు. మొక్కలు నాటడం ద్వారా అపార్ట్మెంట్ వాసులు, చుట్టపక్కల కాలనీల వాసులకు ఎంతగానో ఉపయోగ పడుతుంది అని ఎమ్మెల్యే గాంధీ తెలియచేశారు. హరిత వైభవోత్సవంలో భాగంగా రుద్రాక్ష, జమ్మి, మారేడు, చింత, సంపెంగ, మామిడి,పనస, తెల్ల నేరేడు, వాటర్ ఆపిల్, మల్బరీ, అవకాడో, నిమ్మ, ఉసిరి వంటి పండ్ల జాతుల మొక్కలను మరియు పూలను నాటారు.

## ఘనంగా శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవ వేడుకలు

### ప్రత్యేక పూజలు నిర్వహించిన బండి రమేష్...



కూకట్‌పల్లి, జూన్ 15 (వాయిస్ టుడే) : అల్లాపూర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేద పండితులు వారితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, పూలమాలలతో అత్యంత సుందరంగా అలంకరించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యా విలసిల్లాలని స్వామివారిని రమేష్ కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, విట్టల్ రెడ్డి, పుష్పారెడ్డి, నరసింహా యాదవ్, సుంకన్న, భరతమా తదితరులు పాల్గొన్నారు.

# ఏఎంఎస్ కళాశాలలో హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర అసోసియేషన్ ప్రారంభం



సికింద్రాబాద్, జూన్ 15 (వాయిస్ టుడే ప్రతినిధి): భారతదేశంలోని యువతకు జీవన నైపుణ్యాలు, నైతిక సూత్రాలు తెలిపేందుకు హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ చీఫ్ కమిషనర్ అద్దంకి దయాకర్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆంధ్ర మహిళా సభ కళాశాలలో హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ ప్రారంభించారు. అసోసియేషన్ కు చీఫ్ కమిషనర్ గా నియమించడం పై అద్దంకి దయాకర్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతి విద్య సంస్థలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ను ప్రారంభించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. విద్యార్థులకు, యువతకు దేశం మరియు సమాజం పట్ల కర్తవ్య భావంతో సాధికారత కల్పించేందుకు ఇది ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హిందుస్థాన్ స్పోర్ట్స్ అండ్ గైడ్స్ నేషనల్ ప్రెసిడెంట్ నర్సింగ్ మోహన్ మాట్లాడుతూ మాట్లాడుతూ మన దేశానికి ఉజ్వల భవిష్యత్తును రూపొందించడానికి, బాధ్యతాయుతమైన పౌరులు మరియు నాయకులుగా యువతను స్కౌట్స్ అండ్ గైడ్స్ సిద్ధం చేస్తుందన్నారు. భారతదేశంలో 40 లక్షల మంది విద్యార్థులు స్కౌంట్స్ అండ్ గైడ్స్ ఉన్నారని, తెలంగాణ నుండి ఎక్కువ సంఖ్య విద్యార్థులు స్కౌట్ అండ్ గైడ్స్ లో పాల్గొనటం సంతోషకరంగా ఉందన్నారు.



కేంద్ర బొగ్గు గనులు,మైన్స్ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డిని శుక్రవారం ఢిల్లీలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి కూరపాటి విజయకుమార్ తదితరుల దృశ్యం. _ (వాయిస్ టుడే ప్రతినిధి) ఉప్పల్



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పదవి బాధ్యతలు స్వీకరించిన బండి సంజయ్ కుమార్ ను డిల్లీ లో వారి చాంబర్లో కలిసి అభినందనలు తెలియజేసిన బిజెపి మేడ్చల్ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కూరపాటి విజయ్ కుమార్ తదితరులు దృశ్యం. _ (వాయిస్ టుడే ప్రతినిధి) ఉప్పల్



## డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టవిక్రమార్కని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శ్రీ యాదాద్రి లక్ష్మి నరసింహస్వామి వారి చిత్రపటం లడ్డు ప్రసాదన్నీ అందజేశారు. వీరితోపాటు యాదాద్రి ఆలయ ఈవో భాస్కరరావు ఉన్నారు.




## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

### :- ఉప్పల్ కార్పొరేటర్ రజితా పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు, కార్పొరేటుకు ధీటుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉప్పల్ కార్పొరేటర్ మందముల రజితాపరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. పదో తరగతిలో 100శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. శనివారం ఉప్పల్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని వడ్డించాలని ఈ సందర్భంగా రజితాపరమేశ్వర్‌రెడ్డి సూచించారు. పాఠశాలలో శుభ్రమైన మంచినీరు విద్యార్థులకు అందించేలా చూడాలన్నారు. కురుస్తున్న వర్షాలతో పాఠశాల పరిసరాలను సైతం శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.వెంకటేశ్వర్లు, టీచర్స్ శ్రీనయ్య, ఎల్జబెత్, పి . వెంకట్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, లక్ష్మణ్ రావు,కె వి విజయ లక్ష్మి, ప్రేమ్ కుమార్, ఎస్-సి సెల్ అధ్యక్షులు లింగంపల్లి రామకృష్ణ, సల్ల ప్రభాకర్ రెడ్డి,అల్వాల భాస్కర్,జనగాం విజయ,అశ్విని,కొమురమ్మ ,జనగాం రాజశ్రీ,సునీత తదితరులు పాల్గొన్నారు.



## లారీయజమానులు, డ్రైవర్లపై పెట్టిన అక్రమకేసులను వెంటనే ఎత్తియాలి

### తెలంగాణ రాష్ట్ర లారీఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

లకిడికపూల్ : జూన్ 15 ( వాయిస్ టుడే ) లారీయజమానులు,డ్రైవర్ల పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తియాలని తెలంగాణ రాష్ట్ర డిజిపికు విజ్ఞప్తి చేసిన తెలంగాణ రాష్ట్ర లారీఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్. ఈ మేరకు డిజిపి కార్యాలయం ముందు అసోసియేషన్ ఉపాఅధ్యక్షుడు సర్వీ యాదవ్ గౌడ్ మాట్లాడుతూ...భద్రాద్రి కొత్తగూడం జిల్లా వాజేడు , వెంకటాపురం పోలీసులు లారీ డ్రైవర్ లపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని అనుమతులతో నిబంధనల ప్రకారం వే బిల్లులతో ఇసుక రవాణా చేస్తున్న డ్రైవర్ లపై పోలీసులు దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. ఇసుక రీచ్ లలో లోడింగ్ చేసుకొని వెళ్తున్న లారీలను అధిక లోడ్ ఉందంటూ... పోలీస్ స్టేషన్ లకు లారీలను తీసుకెళ్లారని విమర్శించారు. ఇసుకను లోడ్ చేయిస్తుంది... అక్కడి కాంట్రాక్టర్ అయితే వారిపై కేసులు పెట్టకుండా , కేవలం లారీ డ్రైవర్ లపై కేసులు పెడుతున్నారన్నారు. లారీ డ్రైవర్లు... ఇసుకనుఅక్రమంగా లోడ్ చేశారని మోటార్ వెహికిల్ యాక్ట్ పై కేసులు పెట్టారన్నారు. టీఎస్ఎండిసి సంస్థ జెసిపి ల ద్వారా లోడింగ్ జరుగుతుందని వారి మీద కేసులు పెట్టకుండా డ్రైవర్ లనె బాధ్యులుగాచేస్తున్నారన్నారు. సుమారు 40 లారీలను పోలీస్ స్టేషన్ లకు తరలించారని తెలిపారు. అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేసే,లారీ డ్రైవర్లను వేధిస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని డీజీపీ ను కోరామని యాదయ్య వివరించారు.

## బాలుడి అదృశ్యం



సికింద్రాబాద్, జూన్ 15 (వాయిస్ టుడే ప్రతినిధి): కుటుంబసభ్యులు మందలించడంతో ఇంట్లో నుండి బయటకు వెళ్లిన బాలుడు అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ అమర్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం నార్త్ లాలాగూడ లోని లిల్లీ మోడల్ స్కూల్ సమీప ప్రాంతానికి చెందిన షేక్ మహ్మద్ (14) అనే బాలుడి తల్లి పదేళ్ల క్రితం చనిపోవడంతో స్థానికంగా ఉండే వారి బంధువుల ఇంట్లో ఉంటున్నాడు. అయితే, ఇటీవల షేక్ మహ్మద్ను శేషాపహాడ్లోని మదర్సాలో చేర్పించారు. కాగా, అతనికి మదర్సాకు వెళ్లడం ఇష్టం లేదని, ఏదైనా పనికి వెళ్తానని కుటుంబసభ్యులతో చెప్పడంతో వారు నిరాకరించారు. పనికి వెళ్లే వయస్సు కాదని చెప్పి బాలుడిని గట్టిగా మందలించారు. దీంతో ఈ నెల 13న మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు వారికి తెలిసిన వారిని, బంధువులను వాకబు చేశారు. అయినప్పటికీ ఆచూకీ తెలియకపోవడంతో శనివారం లాలాగూడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## పెట్రోల్ బంక్‌లో బీర్ బాటిల్స్‌తో హల్చల్ చేసిన యువకుడి అరెస్టు

సికింద్రాబాద్, జూన్ 15 (వాయిస్ టుడే ప్రతినిధి): పెట్రోల్ బంక్ లో పెట్రోల్ కొట్టించుకొని డబ్బులు అడిగినందుకు బంకు సిబ్బందిపై బీర్ బాటిల్తో దాడికి పాల్పడిన పాత నేరస్తున్ని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు శనివారం ఓయూ పీఎస్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏసిపి జగన్ ఆధ్వర్యంలో ఓయూ సిఐ రాజేంద్ర నాయక్ , ఎస్సై రవి తెలిపిన వివరాల ప్రకారం ఉప్పల్ ప్రాంతానికి చెందిన పాకాల లోకేష్( 22), ఆంజనేయులు అనే ఇద్దరు వ్యక్తులు తార్నాకలోని హెచ్పీ పెట్రోల్ బంక్లో ఈ నెల 8వ తేదీన సాయంత్రం నాలుగున్నర గంటలకు నంబర్ ప్లేట్ లేని వాహనంపై వచ్చి, రూ.100 పెట్రోల్ కొట్టించుకున్నారు. డబ్బులు ఇవ్వకుండానే బైక్ స్టార్ట్ చేసి వెళుతుండటంతో బంకుకు చెందిన మరో ఉద్యోగి వాహనాన్ని వెనకనుంచి పట్టుకున్నాడు. ఈ క్రమంలో ఆ వ్యక్తులు బీరు సీసా తీసి, ఉద్యోగిపై దాడి పాల్పడి, అక్కడి నుంచి పారిపోయారు. ఈ క్రమంలో ఆ ఉద్యోగి కిందపడడంతో పాటు చేతులపై గాయాలయ్యాయి. దీనిపై బంకు ఉద్యోగులు ఓయూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల లో ఒకడు లొకేషన్ అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుండి ఒక బైకు సెల్ ఫోను స్వాధీనం చేసుకున్నారు లోకేష్ పైన పల్స్ స్టేషన్లో ఎనిమిది కేసులు నమోదు అయి ఉన్నట్లుగా తెలిపారు ఆంజనేయులు పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

## విదేశీ విద్యార్థుల వసతి గృహంపై నుండి దూకి విద్యార్థి ఆత్మహత్యాయత్నం



సికింద్రాబాద్, జూన్ 15 (వాయిస్ టుడే ప్రతినిధి): తార్నాకలో ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ పరిధిలోని ఇంటర్నేషనల్ హాస్టల్లోని విద్యార్థి బిల్డింగ్ పై నుండి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం కుదుర్మల్ల గ్రామానికి చెందిన ముల్కగల్ల రవి నిజాం కళాశాలలో ఎంఏ తెలుగు మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో అతడికి వర్సిటీ అధికారులు ఇంటర్నేషనల్ హాస్టల్లోని గదిని కేటాయించారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం హాస్టల్ బిల్డింగ్ పై నుంచి రవి దూకగా పెద్ద శబ్దం వచ్చింది. శబ్దం విన్న తోటి విద్యార్థులు అతడిని హుటాహుటిన ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని శ్రీకర్ హాస్పిటల్ తరలించారు. తలకు తీవ్రగాయమైన గాయమై ప్రాణాపాయ స్థితిలో అతడికి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆత్మహత్యాయత్నానికి ప్రేమ వ్యవహారమే కారణమా, లేదా ఏమైనా వ్యక్తిగత సమస్యలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## ఓయులో బట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు

సికింద్రాబాద్, జూన్ 15 (వాయిస్ టుడే ప్రతినిధి): ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు టిపిసిసి అధికార ప్రతినిధి లోకేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాణాసంచా కాల్చి పెద్దఎత్తున సంబరాలు జరిపారు. టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ లోకేష్ యాదవ్ కేక్ కట్ చేసి డిప్యూటీ సీఎంకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి 1365 కిలోమీటర్ల పాదయాత్ర తో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క కీలక భూమిక పోషించారని అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ లను అమలు చేసే దిశగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రభుత్వం ముందుకు వెళ్తుందని అన్నారు.



## రెజిమెంటల్ బజార్‌లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే శ్రీ గణేష్

కంటోన్మెంట్, జూన్ 15 (వాయిస్ టుడే ప్రతినిధి) సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని రెజిమెంటల్ బజార్ లోని సమస్యలను హెచ్ఎండబ్ల్యూఎస్ మరియు సేవరేజ్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఈ సందర్భంగా అధికారులకు సమస్యలను వివరించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కృష్ణ మరియు మేనేజర్ అబ్దుల్ హకీం తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్సిటీలకు తక్షణమే రెగ్యులర్ వీసీలను నియమించాలి: ఏఐఎస్ఎఫ్




సికింద్రాబాద్, జూన్ 15 (వాయిస్ టుడే ప్రతినిధి): రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్శిటీలకు తక్షణమే రెగ్యులర్ వీసీలను నియమించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఉస్మానియా యూనివర్సిటీలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వీసీలను నియమించడంలో అలసత్వం ప్రదర్శిస్తుందని మండిపడ్డారు. ఈ నెల 15వ తేదీకంటే ముందే వీసీ లను నియమించి, వర్సిటీల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామందని గుర్తు చేశారు. ఇప్పటి వరకు రెగ్యులర్ వీసీలను నియమించకుండా ఇంచార్జి వీసీలతో పాలన కొనసాగిస్తున్నారన్నారు. వీసీల నియామకాల కోసం ఏర్పాటు చేసిన సెర్చ్ కమిటీలు ఇప్పటి వరకు ఒక్కసారి కూడా సమావేశం కాలేదంటేనే ప్రభుత్వానికి వీసీల నియామకంపై ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు . తక్షణమే వర్సిటీలకు వీసీలను నియమించకపోతే దశలవారీగా విద్యార్థులను సమీకరించి, రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. అక్రమంగా సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందిన వారిని వీసీ నియామకంలో పరిగణనలోకి తీసుకోకూడదని డిమాండ్ చేశారు. వర్సిటీలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. వర్సిటీలలో ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థికి ఉచితంగా మెస్, హాస్టల్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఇంజనీరింగ్, పీజీ, పీహెచ్డీ విద్యార్థులకు ప్రతీ నెల ఫెలోషిప్ ఇవ్వాలని అన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి భవనాలు, హాస్టల్ భవనాలను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నరేశ్, అశ్విన్, రాఘవేందర్, రమేశ్, సంతోష్, వరుణ్ పాల్గొన్నారు.



## కేంద్ర హెూం శాఖ కార్యాలయంను సందర్శించిన బీజేపీ అధ్యక్షులు

### ప్రజలకు రుణపడి ఉండాలని సూచించిన బండి సంజయ్

కరీంనగర్ జూన్ 15(వాయిస్ టుడే )కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన బీజేపీ పార్టీ అధ్యక్షులు శనివారం కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కార్యాలయంను సందర్శించారు.ఈ సందర్భంగా బండి సంజయ్ కు పూల బొకే ఇచ్చి,శాలువాతో సన్మానం చేసారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యునిగా గెలిచిన తర్వాత అత్యున్నత భాధ్యతాయుతమైన శాఖ ను కేటాయించడం పై కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఓటర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారని మండల అధ్యక్షులు సంజయ్ తో పేర్కొన్నారు. సంజయ్‌ను కలిసిన వారిలో సైదాపూర్, తిమ్మాపూర్, జమ్మికుంట, ఇల్లందకుంట,హుజురాబాద్ పట్టణం, మానకొండూర్, చిగురుమామిడి, కమలాపూర్ మండలాల అధ్యక్షులు కందుల శ్రీనివాస్ రెడ్డి,సుగుర్తి జగదీశ్వరాచారి, జీడీ మల్లేష్, సింగిరెడ్డి తిరుపతి రెడ్డి,గంగిశెట్టి రాజు,రాపాక ప్రవీణ్,పైడిపల్లి శ్రీనివాస్, కట్కూరి అశోక్ రెడ్డిలతో పాటుగా ఎగ్గెటి హరీష్,కోట శ్రవణ్ రెడ్డి, మల్లారెడ్డి, అక్కతి వాసు ఉన్నారు.



## నిరుపేద కుటుంబానికి కందుల సత్యనారాయణ ఫౌండేషన్ చేయూత

గ్రేటర్ వరంగల్ 11వ డివిజన్ లోని పోతనవాడకు చెందిన మొహమద్ సంజర్ పాషా ఆటో నడుపుతూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొంతకాలంగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని స్థానిక ప్రతినిధి మెడకట్ల సుకుమార్ ,కందుల సత్యనారాయణ ఫౌండేషన్ సభ్యుల దృష్టికి విషయం తీసుకువచ్చారు. కందుల ఫౌండేషన్ సభ్యులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి ఆర్థిక పరిస్థితిని గమనించి ఫౌండేషన్ తరపున సాయంగా నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను వారికీ అందచేయడం జరిగింది. గతంలో కుడా కందుల సత్యనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు మరియు ఎంతో మందికి చేయూతను ఇచ్చిన విషయం తెలిసిందే. ఫౌండేషన్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం నిజమైన లబ్దిదారులను, అర్హులైన నిరుపేదలను ఆదుకోవాలని అనే సంకల్పంతో కేవలం కీర్తిశేషులు కందుల సత్యనారాయణ కుటుంబ సభ్యులతో ఏర్పాటు చేసిన ఫౌండేషన్ నని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంటెస్టెడ్ కార్పొరేటర్ నాగపూరి పద్మ , కాంగ్రెస్ సీనియర్ నాయకులు పుల్లం సదానందం పటేల్, సిటీ మైనారిటీ జెనరల్ సెక్రటరీ సయ్యద్ అజ్గర్ అలీ , కందుల ఫౌండేషన్ సభ్యులు కార్తీక్ సింగ్, అల్తాఫ్, సీనియర్ నాయకులు ముప్పు సతీష్, గడ్డం రమేష్ , కొప్పుల సునీల్, తోట సుమంత్,సిలువేరు సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పారమిత ఉన్నత పాఠశాలలో ఘనంగా పాఠశాల పునఃప్రారంభ స్వాగత సభ



కరీంనగర్ జూన్ 15(వాయిస్ టుడే )స్థానిక నగరంలోని పారమిత ఉన్నత పాఠశాలలో ఘనంగా నూతన విద్యా సంవత్సర పునఃప్రారంభ సమావేశాన్ని పాఠశాలల అధినేత డా: ఇనుగంటి ప్రసాదరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. వేసవి సెలవులకు ఆనందోత్సాహాలతో ముగింపు పలికిన విద్యార్థులు నూతన విద్యాసంవత్సరానికి తిరిగి రావడంతో మంకమ్మ తోటలోని పారమిత ఉన్నత పాఠశాల ప్రాంగణం విద్యార్థుల ఆనందోత్సాహాలతో కళకళలాడింది. పాఠశాలపునఃప్రారంభ సందర్భాన్ని పురస్కరించుకుని విద్యార్థులను స్వాగతించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రార్థనా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా: ఇ.ప్రసాదరావు మాట్లాడుతూ విద్య యొక్క గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. కొత్త విద్యాసంవత్సరంలో విధ్యార్థిని, విధ్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలు, సలహాలు సూచనలను విద్యార్థులకు వివరిస్తూ నూతన విద్యాసంవత్సరంలో అడుగుపెడుతున్న విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను ఉత్సాహపరిచే ఆటలు, పాటలు మరియు నృత్యాలు, ప్రేరణాత్మక ప్రసంగాలు, విద్యార్థులలో నూతనోత్సాహాన్ని నింపి, రాబోయే విద్యా సంవత్సరానికి శుభారంభం పలికింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ రశ్మిత, ప్రసూన, అనూకర్ రావు, టి.యస్.వి.రమణ, వి.యు.యం.ప్రసాద్, హన్మంత రావు మరియు ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవిత ప్రసాద్ సమన్వయకర్తలు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అరుదైన గుడ్లగూబ



వాయిస్ టుడే న్యూస్ చింతలపాలెం ప్రతినిధి: సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం గుడిమల్కాపురం గ్రామంలో అరుదైన తెల్ల గుడ్లగూబ ప్రత్యక్షమైంది సాధారణంగా గుడ్లగూబలు నలుపు వర్ణంలో ఉండటము మనము తరచూ చూస్తూ ఉంటాం. ఇది ప్రకృతికి భిన్నంగా కనిపించింది గుడిమల్కాపురం గ్రామంలో అరుదైన తెల్ల గుడ్లగూబ ప్రత్యక్షమైంది గ్రామంలో సంచరిస్తూ తెల్ల గుడ్లగూబకు ఒక కాలు రెక్క విరిగింది ఆ గ్రామస్తులు గమనించి ఒక వింత ఆకారంలో ఉన్న పక్షి చూసి స్థానికులు వింతగా చూసి ఒక్కసారిగా అవ్వక్కయ్యారు ఆ గ్రామస్తులు ఆ పక్షిని తీసుకొని స్థానిక వెటర్నరీ డాక్టర్ వద్దకు తీసుకెళ్లారు చికిత్స చేసి ఫారెస్ట్ ఆఫీసర్ అనీల్ కుమార్ కు అప్పగించారు.

# ఆర్ఎంపి పిఎంపి డాక్టర్లపై జరుగుతున్న దాడులను అరికట్టాలి

### తెలంగాణ కమ్యూనిటీ ఆర్.ఎం పి. పి.ఎం.పి వైద్యుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఉక్కుల అశోక్




సికింద్రాబాద్, జూన్ 15 (వాయిస్ టుడే ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా ఆర్ఎంపి పిఎంపి డాక్టర్లపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని తెలంగాణ కమ్యూనిటీ ఆర్.ఎం పి,పి.ఎం.పి వైద్యుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఉక్కుల అశోక్ డిమాండ్ చేశారు. శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కమ్యూనిటీ వైద్యుల ఐక్యవేదిక ఆధ్వర్యం ఈనెల 19వ తేదీన నిర్వహించే పాదయాత్ర వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హక్కుల అశోక్ మాట్లాడుతూ. జీవో నెంబర్ 1273 2008 ప్రకారం రాష్ట్రంలో ఉన్న ఆర్ఎంపి పిఎంపీలకు కమ్యూనిటీ పారమెంటల్ కోర్సు దాదాపు 1000 గంటలు శిక్షణ ఇవ్వడం జరిగింది అని తెలిపారు.ఈ శిక్షణ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రభుత్వ వైద్యుల చేత ఆర్ఎంపి వైద్యులకు శిక్షణ ఇవ్వడం జరిగింది తదుపరి ఎగ్జామినేషన్ పెట్టి సర్టిఫికెట్ ఇవ్వడం లేదన్నారు. వెంటనే ట్రైనింగ్ సర్టిఫికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఆర్ఎంపి పిఎంపీ ల మీద రైడింగ్ చేయడం జరుగుతుందని, ఫేక్ డాక్టర్స్ మీరు వైద్యం చేసే అర్హత లేదు ప్రాథమిక వైద్యం చేయొద్దని చెప్పడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వము తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ నిర్వహించే రైడింగ్స్ ను వెంటనే ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఈ దాడులకు నిరసనగా19 వ తారీకు ఎల్బినగర్ సర్కిల్ నుండి తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ కోటి హైదరాబాద్ వరకు పాదయాత్ర నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సదానందం జనరల్ సెక్రెటరీ నవీన్ కుమార్, హైదరాబాద్ డిస్ట్రిక్ట్ మైనారిటీస్ ప్రెసిడెంట్ ఇబ్రహీం, సెక్రటరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పీఎం కిసాన్ యోజన రైతులకు ఓ వరం

**18న వారణాసిలో ప్రధాని మోదీ కిసాన్ సమ్మేళన్ ప్రోగ్రాం**

**జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో వర్చువల్ గా జరిగే ప్రోగ్రామ్ కు హాజరుకానున్న కేంద్రమంత్రి సోమన్న**

**రైతులందరూ 18న జమ్మికుంట లో జరిగే ప్రోగ్రాంలో పాల్గొనండి**

**బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి**



కరీంనగర్ జూన్ 15(వాయిస్ టుడే )రైతులకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మన్ నిధి యోజన ఓ వరం లాంటిదని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. ఈనెల 18న ప్రధాని మోదీ కిసాన్ సమ్మేళన్ ప్రోగ్రాం నేపథ్యంలో జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం లో వర్చువల్ గా జరిగే ప్రోగ్రాం ఏర్పాట్లను స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18న వారణాసిలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హాజరవుతున్న కిసాన్ సమ్మేళన్ ప్రోగ్రాం దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో వర్చువల్ గా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయనీ తెలిపారు. ఇట్టి ప్రోగ్రాం జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర జల, రైల్వే సహాయక మంత్రి వి సోమన్న హాజరవుతారని తెలిపారు. జమ్మికుంటలో జరగబోయే కార్యక్రమాన్ని రైతులందరూ విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ముఖ్యంగా 17వ విడుత కిసాన్ సమ్మన్ నిధి యోజన నిధులు విడుదల చేయడం జరిగిందని, ఇన్స్టాల్మెంట్ కు సంబంధించిన ఫైల్ పైనే మూడోసారిగా ప్రధానమంత్రి మోడీ సంతకం చేశారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ముఖ్యంగా మిలియన్ల రైతులకు పెట్టుబడి కోసం ఇబ్బంది పడకుండా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అందిస్తుందన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సమయం ప్రారంభం కావడంతో రైతులకు పెట్టుబడికి ఇది బాగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కే వి కే శాస్త్రవేత్తలు వెంకటేశ్వర్లు రావు, ప్రభాకర్ ,అనిల్ ప్రశాంతి ,జమ్మికుంట మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, జిల్లా కిషన్ మోర్చా మాడుగుల సమ్మిరెడ్డి, జమ్మికుంట మండల అధ్యక్షుడు సంపెల్లి సంపత్ రావు, పల్లపు రవి ,దొంతల రాజకుమార్ పరిపెల్లి కొండల్ రెడ్డి ,కైలాసకోటి గణేష్ ,మోతే స్వామి, అప్పం మధు యాదవ్ ,ఇటుకల స్వరూప, భీమిలి కిషన్ రావు ,మోడం రాజు ,గిరవని విజేందర్, మేక సుధాకర్ రెడ్డి రాచపల్లి ప్రశాంత్ ,గర్రెపల్లి నిరుపా రాణి, దేవులపల్లి నవీన్ ,బచ్చు శివకుమార్ ,రవీందర్ ,బద్రి యాంసాని సమ్మయ్య ,కొండపర్తి ప్రవీణ్ ,రాపర్తి ప్రవీణ్, కేశ స్వరూప రాపర్తి అఖిల్ ,తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ స్కూళ్లలో ఫీజులు తగ్గించాలి

**బీ డీ ఎస్ ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ**



వాయిస్ టుడే జూన్ 16 ( సిద్దిపేట జిల్లా ప్రతినిధి ) సిద్దిపేట జిల్లాలో ఎక్కడైనా మారుమూల ప్రాంతాలు మరియు గ్రామాలలో. ఆరకూర సౌకర్యాలు ఉన్న ఒక పాఠశాలలో ఏదైనా బిఈడి చేసిన వ్యక్తిపాఠశాలలో బోధించడానికి అర్హుడు. కానీ ఇది సిద్దిపేట డీఈవో మరియు కలెక్టర్ దీని మీద స్పందించి. స్కూలుకు ఉండే వసతులను. సిటిజన్ చాట్ రోల్. ఉండాలి. కానీ. ఏ విధమైన గవర్నమెంట్ ప్రొజెటింగ్లో గవర్నమెంట్ కు సంబంధించిన గవర్నమెంట్ కు సంబంధించిన స్కూల్ విధానం యొక్క ఫీజుల వివరాలను ప్రతి స్కూలుకు అందజేయాలి ఒక కమిటీ ఏర్పాటు చేసి ఆ విధంగా చేసి పేద విద్యార్థులు బతుకుతారు.అప్పుడు కార్పొరేట్ కళాశాలలో ఫీజుల వసూలు కూడా ఉండవు.ఏ కార్పొరేట్ కళాశాలలో. సిబిఎస్సి సిలబస్ అని చెప్పి ఫీజులు దుర్మార్గంగా వసూలు చేస్తూ ప్రజలను పేద ప్రజలను పీడిస్తూ విధంగా జరుగుతున్న జరగనట్టుగా ఉంటూ. స్కూలు యజమాన్యంతో. మాట్లాడి వెంటనే దానికో జీవో అమలు చేసి. ప్రతి కార్పొరేట్ స్కూల్లో ప్రైవేట్ స్కూళ్లకు. ఫీజు గవర్నమెంట్ నిర్ణయం చేసిస్కూల్లో పంపివ్వవాలను. స్కూల్లో స్కూల్లో బస్సులు ఉంటాయి కానీ ఆర్టీవో బస్సు ఫిట్నెస్ కానీ ఇన్సూరెన్స్ గాని ఏది ఏ విధంగా ఉన్నప్పటికీ కూడా చెక్ చేయనిగా చెక్ చేయడం లేదు. బీ డీ ఎస్ ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తెలియజేశారు.

## సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన చేవెళ్ల పోలీసులు



జూన్ 15(వాయిస్ టుడే)శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలో నీ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ నాగరాజు తన సిబ్బందితో కలిసి శంకర్ పల్లి పట్టణంలో ఉన్న వ్యాపారులకు నేరాలపైన అవగాహన మరియు దొంగతనాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. నేరాలని నివారించడం లో సీసీ కెమెరాల ప్రాముఖ్యతని వివరిస్తూ ప్రతీ షాప్ దగ్గర సీసీ కెమెరా లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మరియు ఈ సందర్భంగా వారందరికీ సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు.



## ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు ఎంపికైన మఖ్తల్ వాసి

మక్తల్ జూన్ 15 వాయిస్ టుడే ప్రతినిధి: ప్రతి వ్యక్తిలోని దైవత్మాన్ని మేలు కోలుపుటకు, పుట్టపర్తి సాయిబాబా చూపిన మార్గంలో పయనిస్తూ, ఆధ్యాత్మిక తత్వమును భోధిస్తూ, ప్రతి మనిషిలోను చైతన్యం కల్గిస్తు, ఏన్నోన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తు,ఎంతో మంది జీవితాలలో వెలుగులు నింపుతూ సమసమాజ నిర్మాణంలో తనవంతు పాత్ర పోషిస్తున్న నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త డా. లక్ష్మీనారాయణ (సాయిరాం) సేవలకు గుర్తుగా ప్రఖ్యాత ఉత్తర భారతదేశ స్వచ్ఛంద సంస్థ మై ఇండియా – మై ప్రైడ్ సంస్థ హైదరాబాద్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డును, ప్రశంస పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా అవార్డు గ్రహీత "డాక్టర్ సి.లక్ష్మీ నారాయణ (సాయిరాం)" మాట్లాడుతూ భగవాన్ సత్య సాయిబాబా ఆశీస్సులతో శాయాశక్తుల ఆపదలో ఉన్న వారిని ఆదుకున్నానని, ఎన్నో సామాజిక కార్యక్రమాలను నిర్వహించానని, ఆ భగవంతుని ఆశీర్వాదంతో ప్రతిభగల ఎందరో విద్యార్థులకు పై చదువులకు కావలసిన చేయూతను అందించానని, ప్రతి వేసవిలో భగవాన్ సత్యసాయి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి, సేవా కార్యక్రమాలు చేశానని ఇలాంటి కార్యక్రమాలన్నీ నాకు ఎంతో శక్తిని, ఉత్సాహాన్ని, ఆనందాన్ని, కలిగిస్తాయని భగవాన్ సత్యసాయి ఆశీస్సులు ఉన్నన్ని రోజులు సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తానని అన్నారు. మక్తల్ పట్టణం నుండి అవార్డు అందుకున్న డాక్టర్ సి లక్ష్మీనారాయణని బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు అభినందించారు.

## నారాయణపేట జిల్లా కలెక్టర్‌గా సిక్తా పట్నాయక్

**పెద్దపల్లికి బదిలీ అయిన కోయ హర్ష...**



మక్తల్ జూన్ 15 వాయిస్ టుడే ప్రతినిధి: నారాయణపేట జిల్లా నూతన కలెక్టర్ గా సిక్తా పట్నాయక్ నియమితులయ్యారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఐఏఎస్ ల బదిలీల్లో భాగంగా సిక్తా పట్నాయక్ నూతన కలెక్టర్ గా రానున్నారు. ఇప్పటివరకు జిల్లా కలెక్టర్ గా పని చేసిన కోయ హర్ష... పెద్ద పల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. ఢిల్లీకి చెందిన సిక్తా పట్నాయక్... హన్మకొండ జిల్లా కలెక్టర్ గా ఇప్పటివరకు పని చేశారు. ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న అధికారిణిగా పేరు గడించారు. సిక్తా పట్నాయక్ నారాయణపేట జిల్లా కలెక్టర్ గా ఎంపిక కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# ఆకాశానందుతున్న కూరగాయలు, ఉల్లి ధరలు...

# సామాన్యులకు పట్ట పగలు చుక్కలు...

వరంగల్ (వాయిస్ టుడే) జూన్ 15: సహజంగా వేసవి రాగానే కూరగాయల ధరలు పెరుగుతాయి. వర్షాకాలం ప్రారంభం కాగానే ధరలు కాస్త తగ్గుతాయి. కానీ ఈ సంవత్సరం అందుకు భిన్నంగా ఎండాకాలం ధరలు నామమాత్రంగా పెరిగి, వర్షాకాలం మొదట్లో ధరలు అమాంతం చుక్కలను తాకుతున్నాయి. ఉల్లిపాయల నుంచి కూరగాయల వరకు అన్ని ధరలు పెరగడంతో సామాన్యుల పరిస్థితి దారుణంగా తయారయింది.

**కూరగాయలు, ఉల్లిపాయలు కొనలేని ధరలు**

ఏం కొనేటట్టు లేదు ఏం తినేటట్టు లేదు అంటూ సామాన్యులు కూరగాయలను, ఉల్లిపాయలను కొనాలంటే లబోదిబోమంటున్నారు.ప్రస్తుతం దాదాపు అన్ని కూరగాయల ధరలు కిలో 80 రూపాయల వరకు పలుకుతున్నాయి. 15 రోజుల వ్యవధి లోనే ఉల్లిపాయలు, టమాట సహా అన్ని కూరగాయల ధరలు 60 శాతం వరకు పెరిగాయి. డిమాండ్ కు తగ్గట్టు ఉత్పత్తి లేకపోవడంతో ధరలు పెరుగుతున్నట్టుగా తెలుస్తుంది.

**అమాంతం పెరిగిపోయిన కూరగాయల ధరలు**

మే నెల మూడో వారంలో 20 రూపాయలు పలికిన ఉల్లిపాయల ధరలు, కిలో ప్రస్తుతం 50 రూపాయలకు



చేరింది. టమాటా ధర కూడా ప్రస్తుతం కిలో 50 రూపాయలకు పైనే పలుకుతుంది. ఇక క్యారెట్, వంకాయలు, బీన్స్, బీరకాయలతో పాటు ఆకుకూరల ధరలు కూడా అమాంతం పెరిగాయి. తెలంగాణ జనాభాకు ప్రతి ఏడాది 38.54 లక్షల టన్నుల కూరగాయలు అవసరమవుతాయి.

**తెలంగాణాలో డిమాండ్‌కు తగ్గటు లేని కూరగాయల ఉత్పత్తి**

అయితే ప్రస్తుతం 19.54 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతున్న పరిస్థితి ఉంది. ప్రజల అవసరాలకు తగ్గట్టుగా ఉత్పత్తి లేకపోవడం, ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు చేసుకోవాల్సి రావడం కారణంగా కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలలో బాగా పెరిగిన కూరగాయల ధరలు, ఉల్లిపాయల ధరలు కూరగాయలు కొనాలంటే కన్నీళ్లు తెప్పిస్తున్నాయి.

**ధరాఘాతం శరా ఘాతంగా**

ప్రస్తుతం నిత్యవసర వస్తువుల ధరలతో పాటు, కూరగాయల పైన కూడా పడుతున్న ధరాఘాతం సామాన్యులకు శరాఘాతంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం కొండెక్కి కూర్చున్న కూరగాయలు, ఉల్లిపాయల ధరలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటే బాగుంటుందన్న అభిప్రాయం సామాన్యుల నుండి వ్యక్తం అవుతుంది.



## కుడా వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అశ్విని తానాజీ వాకడే

**-కుడా కార్యాలయంలో బాధ్యత స్వీకరణ**

వరంగల్ జూన్ 15 (వాయిస్ టుడే) కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ( కూడా )వైస్ చైర్మన్ గా అశ్విని తానాజీ వాకడే శనివారం కుడా కార్యాలయంలో పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కుడా కు చెందిన ఉన్నతాధికారులు వైస్ చైర్మన్‌కు పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. బల్దియా కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న క్రమంలో కుడా వైస్ చైర్మన్‌గా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో వైస్ చైర్మన్ గా కూడ ఆమె బాధ్యతలు చేపట్టారు.

## వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్

వరంగల్ (వాయిస్ జూన్) 15: సివిల్ ప్రిలిమ్స్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుగాను వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ ను అమలు చేస్తున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఇంచార్జ్ సిపి అభిషేక్ మొహంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులను అనుసరించి ఆదివారం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించడం నేరం. ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే వారి చట్టపరమైన చర్యలు తీసుకోబడుతాయని ఇంచార్జ్ సిపి తెలిపారు.



## రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యక్తికి ఆర్థిక సహాయం అందజేసిన భీమ్ భారత్

చేవెళ్ల..జూన్ 15(వాయిస్ టుడే)నవాబ్ పేట మండలం ఎల్లకొండా గ్రామవాసూల రోడ్డు ప్రమాదం గ్రామంలో విషాదఛాయలు చోటు చేసుకున్నాయి.గురువారం పులుసు మామిడి గేట్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదంలో మరణించిన ,గాయపడిన గ్రామస్తులను పరామర్శించిన చేవెళ్ళ అసెంబ్లీ ఇంచార్జ్ శ్రీ పామేన భీమ్ భరత్. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ కొంత ఆర్థిక సహాయం చేసి, కాంగ్రెస్ పార్టీతో మీకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల అధ్యక్షుడు వెంకటయ్య ,వర్కింగ్ ప్రెసిడెంట్ కొండల్ యాదవ్,నియోజకవర్గ యువజన కాంగ్రెస్ కార్యదర్శి ఉపేందర్ రెడ్డి ,నాయకులు వెంకట్ రెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి , తదితర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## చేబర్తి ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం

**సారథి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలకలు పంపిణీ**

వాయిస్ టుడే జూన్ 16( సిద్దిపేట జిల్లా ప్రతినిధి ) సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం చేబర్తి గ్రామంలో శనివారం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నర్సింలు ఆధ్వర్యంలో చిన్నారి విద్యార్థిని విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు,ఈ కార్యక్రమంలో పాల్గొన్న సారథి ఫౌండేషన్ చైర్మన్ గుడాల శేఖర్ గుప్తా ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు పలకలు, బలుపాలు,బిస్కెట్స్ అందజేశారు,ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింలు, గ్రామ తాజా మాజీ సర్పంచ్ అశోక్, తాజా మాజీ ఉప సర్పంచ్ స్వామి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో చేరిన చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించడం జరిగిందని ప్రతి సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు సారథి ఫౌండేషన్ చైర్మన్ గుడాల శేఖర్ గుప్తా ఆధ్వర్యంలో చిన్నారులకు పలుకులు అందజేస్తారని,అలాగే ఈ సంవత్సరం కూడా విద్యార్థిని విద్యార్థులకు పలకలు అందజేయడం జరిగిందని వారికి అభినందనలు తెలిపారు అనంతరం గుడాల శేఖర్ గుప్తా మాట్లాడుతూ నేటి బాల బాలికలే రేపటి భావి భారత పౌరులు అని చిన్ననాటి నుంచే విద్యార్థిని విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు,అలాగే ప్రతి ఒక్కరూ సేవా నిరతి కలిగి ఉండాలని అన్నారు ఈ కార్యక్రమంలో కార్యదర్శి సిద్దేశ్వర్,జర్నలిస్ట్ జాలని యాదగిరి,చిన్ని కృష్ణ,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అఖిల,ఉపాధ్యాయురాలు నాగలక్ష్మి, సుదీష్ణ,స్వాతి,జ్యోతి, అంగన్వాడి టీచర్లు రాణి,స్వప్న, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## వృద్ధులపై వేధింపులను అరికట్టాలి

### తాసిల్దార్ నాన్య నాయక్ వినతి పత్రం అందజేత

వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా జూన్ 15 : నవాబుపేట్ మండలం కేంద్రంలో సీనియర్ సిటిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వృద్ధుల వేధింపులపై మానసిక శరీరక, ఆర్థిక వేధింపులను హరికట్టాలని జిల్లా సీనియర్ సిటిజన్ పోరం నాగభూషణ్ ఆహ్వానించారు శనివారం మధ్యాహ్నం ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మండలంలోని ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు చిగుర్లపల్లి నర్సములు పచ్చజెండా ఊపి ర్యాలీని నిర్వహించారు . వృద్ధుల వేధింపులకు నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని వృద్ధులు తమ సమస్యల గురించి నవాబు పేట్ మండలం ఎమ్మార్వో నాన్య నాయక్ వెంటనే పరీక్షించాలని ఫోరం భవనం కొరకు 500 గజాల స్థలాన్ని కేటాయించాలని ఎమ్మార్వో కు సీనియర్ సిటిజన్ ఫోరం ప్రజాప్రతినిధులు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్, వెంకటేశ్వర అప్ప, శివ స్వామి, శేఖరయ్య, వెంకటయ్య, పండరీనాథ్, ఆనందం, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు

## నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్‌కు ఎక్లాస్ పూర్ విద్యార్థుల ఎంపిక





సైదాపూర్:(వాయిస్ టుడే )పేద పిల్లలను ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టబడిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ కు సైదాపూర్ మండలంలోని ఎక్లాస్ పూర్ ఉన్నత పాఠశాలకు చెందిన మహమ్మద్ సాదియా, మమ్మద్ సనాలు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్టా రవీంద్ర చారి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు సంవత్సరానికి 12000 ల రూపాయలు చొప్పున ఉపకార వేతనంగా అందుతుందని వారు పేర్కొన్నారు. 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించే ఈ ప్రతిభా పరీక్షలో సాదియా సనాలు తమ ఉత్తమ ప్రతిభ కనబరిచి విద్యార్థులుగా స్కాలర్షిప్ కు ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు సంపత్ రెడ్డి, అశోక్ రెడ్డి, సత్యనారాయణ, ప్రవీణ్,,మధు కుమార్ ,జస్బీర్ సింగ్, వేణుగోపాల శర్మ తదితరులతో పాటు తల్లిదండ్రులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.



## జాబ్ మేళా కు విశేష స్పందన

(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జూన్ 15) శనివారం జిల్లా ఉపాధి కల్పనాధికారిణి ,భద్రాద్రి కొత్తగూడెం వారి ఆధ్వర్యంలో జరిగిన జాబ్ మేళా కు విశేష స్పందన లభించింది . అపోలో ఫార్మసీ, సాయి అంజనా మోటార్స్ కంపెనీ లు పాల్గొన్నాయి .మొత్తం (220) మంది అభ్యర్థులు పాల్గొనగా వారిలో (102) మంది అభ్యర్థులు సెలెక్ట్ అయ్యారు ...వారిలో (92) మంది అపోలో ఫార్మసీ కి , (10) మంది సాయి అంజనా మోటార్స్ కి సెలెక్ట్ అయ్యారు ...సెలెక్ట్ అయిన వారికి వెంటనే నియామక పత్రాలు అందించారు.

**అభ్యర్థులు హాజరు కావడం , ఎక్కువ మంది ఉద్యోగాలు పొందడం సంతోషం గా ఉంది** – విజేత వేల్పుల ,జిల్లా ఉపాధి కల్పనాధికారిణి

ఎన్నికల కోడ్ సందర్భం గా చాలా విరామ తర్వాత జాబ్ మేళా ఏర్పాటు చేయడం జరిగింది...అయినప్పటికీ అభ్యర్థులు చాలా మంది పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం సంతోషం గా ఉంది...ఇకపై ప్రతి నెల జాబ్ మేళా ఏర్పాటు చేసి అందరికీ ఉద్యోగాలు వచ్చేలా కృషి చేస్తాం . తక్కువ టైమ్ లో జాబ్ మేళా ను ఏర్పాటు చేసినా , విశేషం గా వార్తను ప్రచురించిన పాత్రికేయ మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు.



## చిన్నరాజమూరు ఆంజనేయస్వామిని దర్శించుకున్న ఎంపీ అరుణమ్మ

వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా (జూన్ 15) దేవరకద్ర నియోజకవర్గం : పాలమూరు జిల్లా ఎంపీ గా విజయం సాధించిన తర్వాత తొలిసారి దేవరకద్ర నియోజకవర్గం చిన్న రాజమూరులో ఎంపీ డీకే అరుణ పర్యటన సందర్భంగా ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు మహబూబ్నగర్ జిల్లా ఎంపీ డీకే అరుణమ్మకు మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికిన ఆలయ అధికారులు, ఆంజనేయస్వామి వారి ఆశీస్సులు అందరి పై ఉండాలని అరుణమ్మ అన్నారు. ప్రధాని మోడీ సహాయ సహకారాలతో పాలమూరు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు మహబూబ్ నగర్ ఎంపీ గా ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత తొలిసారి దేవరకద్ర నియోజకవర్గం చిన్నరాజమూరు ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఎన్నికలకు ముందునాటి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన అరుణమ్మ ఆసక్తికర కామెంట్స్ చేసారు. మహబూబ్ నగర్ ఎంపీ గా విజయం సాధించిన తర్వాత తొలిసారి చినరాజమూరు లోని ఆంజనేయ స్వామి దేవాలయానికి చేరుకున్న అరుణమ్మ కు ఆలయ అధికారులు, అర్చకులు మంగళ వాయిద్యాలతో సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి దేవరకద్ర నియోజకవర్గం బిజెపి పార్టీ నాయకులు శ్రేయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా మెడికల్ బోర్డు

**అనారోగ్య సమస్యలు ఉంటేనే అన్ ఫిట్**

**ఎలాగైనా అన్ ఫిట్ చేయిస్తామని ప్రలోభ పెట్టే వారిని నమ్మొద్దు**

**మోసగాళ్ల వివరాలను 9491144104 నెంబరుకు ఫోన్ చేసి లేదా వాట్సప్‌లో పంపించండి**

**సింగరేణి కార్మికులను మోసగించే వారిని కటకటాల్లోకి పంపుతాం**

**ఛైర్మన్ ఎండీ ఎన్.బలరామ్ హెచ్చరిక**



(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జూన్15) అనారోగ్య కారణాల వల్ల ఉద్యోగం చేయలేకపోతున్న కార్మికుల కోసం ప్రతినెల నిర్వహించే మెడికల్ బోర్డును అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్న ప్రతి కార్మికుడిని తప్పనిసరిగా అన్ ఫిట్ చేయడం జరుగుతుందని, ఈ విషయంలో ఏ ఇతరుల ప్రమేయం ఉండదని సంస్థ ఛైర్మన్ ఎండీ ఎన్.బలరామ్ స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు.

కొందరు మోసకారులు కార్మికుల వద్దకు వెళ్లి మెడికల్ బోర్డులో ఎలాగైనా అన్ ఫిట్ చేయిస్తామని, వారసులకు ఉద్యోగాలు పెట్టిస్తామని ప్రలోభపెడుతున్నట్లు తెలుస్తోందనీ, ఇటువంటి మోసకారులను ఎవరూ నమ్మవద్దని హెచ్చరించారు. సింగరేణి మెడికల్ బోర్డును పారదర్శకంగా నిర్వహించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని.. అక్రమార్కులు ఎవరైనా సరే ఉక్కు పాదం మోపాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయని తెలిపారు. అలాగే సింగరేణి యాజమాన్యం విజ్ఞప్తి మేరకు రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), నేర దర్యాప్తు సంస్థ(సీఐడీ)లు కూడా సింగరేణి మెడికల్ బోర్డు పై ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

మెడికల్ బోర్డు ప్రక్రియలో అవినీతికి ఎక్కడా ఆస్కారమే ఉండదని.. మాయ మాటలతో మోసగిస్తున్న వారు ఎదురైతే వారి వివరాలను సింగరేణి విజిలెన్స్ అధికారులకు 9491144104 నెంబరుకు ఫోన్ చేసి లేదా వాట్సప్ ద్వారానైనా తెలియజేయొచ్చన్నారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లు పూర్తిగా గోప్యంగా ఉంటాయన్నారు. నిజంగా అనారోగ్య సమస్యలు ఉన్న కార్మికులను మెడికల్ బోర్డు తప్పని సరిగా అన్ ఫిట్ చేస్తుందని తెలిపారు. మెడికల్ బోర్డు నిర్వహణతో పాటు సింగరేణి సంస్థ అత్యంత పారదర్శకంగా కొత్త ఉద్యోగాల కోసం నియామక ప్రక్రియ ప్రారంభించిందనీ, ఈ విషయంలో కూడా ఎవరైనా మోసకారులు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మభ్యపెడుతున్నట్లయితే వారిపై సింగరేణి విజిలెన్స్ శాఖకు ఫిర్యాదు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అత్యంత పారదర్శకంగా సింగరేణిలో ఉద్యోగ నియామక ప్రక్రియ ఉంటుందని, ఎటువంటి రికమండేషన్ లకు, ప్రలోభాలకు అవకాశం ఉండదని ఆయన స్పష్టం చేశారు. సింగరేణి కార్మికులను వంచించే వారిపై కఠిన వైఖరి అవలంబించడం జరుగుతుందని.. ఏసీబీ, సీఐడీ విచారణ ద్వారా జైలుకు పంపడం జరుగుతుందన్నారు. గతంలో ఈ విధంగా చేసిన కొందరిపై విచారణ జరుగుతున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు.




## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

### కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ

(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జూన్ 15) బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి సామాజిక బాధ్యత అని దీనిపైన ప్రజలకు అవగాహన తీసుకురావడానికి ప్రతి సంవత్సరం జూన్ 12వ తేదీన ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవంను జరుపుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. శనివారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, భద్రాద్రి కొత్తగూడెం ఆధ్వర్యంలో చుంచుపల్లి ప్రభుత్వ పాఠశాలలో జరిగిన న్యాయ చైతన్య కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగ పాల్గొని ప్రసంగించారు. పేదరికం ఆర్థిక ఇబ్బందుల వలన చాలామంది పిల్లలు చదువులు మధ్యలో మానేసి ఇటుక బట్టీలలో పరిశ్రమలలో బేకరీ షాపులలో పనిచేస్తున్నారని అలాంటి వారిని గుర్తించి వారి సమస్యలను తెలుసుకుని బడిలో చేర్పించాలని తెలిపారు. ప్రమాదకరవృత్తులలో పనిచేయడం వలన వారు శారీరకంగా మరియు మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. బాల కార్మికులతో వెట్టి చాకిరీ చేయించడం చట్టరీత్యా నేరమని అన్నారు. బాలల పట్ల అనుచితంగా వ్యవహరిస్తూ వారి పేదరికాన్ని ఆసరాగా చేసుకునే వారిని నిలువరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మెండు రాజమల్లు, కాసాని రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంతలక్ష్మి, సంధ్యారాణి, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.



## నిరుపేదలకు ఉచిత కంటి ఆపరేషన్

వాయిస్ టుడే జూన్ 16( సిద్దిపేట జిల్లా ప్రతినిధి ) వివరాలు ఇలా వున్నాయి సిద్ది పేట జిల్లా లో గల గజ్వేల్ ల్లో అక్కడ వున్న ఐ ఆస్పటల్ యాజ మాన్యం నేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలు ఎవరైనా కంటి చూపు సరీగా లేక భాద పడే వాళ్ళు వుంటే అటువంటి ఓ 20 మంది కి ఫ్రీగా ఆపరేషన్ చేయ దళిచారు..ఈ అవకాశాన్ని చుట్టూ వున్న ప్రజానికం వాళ్ళు గమనించి అవకాశాన్ని ఉపయోగించు కోగలరని తెలియ చేశారు.



## వాలీబాల్ కిట్లు పంపిణీ చేసిన సీఐ శశిధర్ రెడ్డి

మందమర్రి జూన్ 15 ( వాయిస్ టుడే): మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఊరు మందమర్రి గ్రామంలో శనివారం సీఐ శశిధర్ రెడ్డి యువకులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు కేంద్ర బిందువు యువత, యువత తలుచుకుంటే ఎన్నో విజయాలను సునాయాసంగా అందుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు అంతటి శక్తి యువతకు ఉందని అన్నారు. క్రీడలు ఆడడం వల్ల శరీరానికి వ్యాయామం అవుతుందని విద్యార్థులు యువకులు చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉదయం వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అలాగే గంజాయి జూదం వంటి చెడు అలవాట్లకు ఇతర చెడు మార్గాల వైపు వెళ్లకుండా చదువుపై దృష్టి పెట్టి ఉద్యోగాలు సంపాదించాలని తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి గురించి ఎటువంటి సమాచారం అయినా పోలీసులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ పోలీస్ సిబ్బంది,, గోపాల్ విశ్వనాథ్ శ్రావణ్ యువత గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాలును సందర్శించిన కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్



(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జూన్ 15) శనివారంన కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు రామవరం కమ్యూనిటీ హాల్ నందు సుమారు 25 లక్షల ఖర్చుతో జరుగుతున్న సివిల్ మరమ్మతుల పనులను సంబంధిత అధికారులతో తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామవరం కమ్యూనిటీ హాల్ లోని పనులను త్వరితగతిన పూర్తిచేసి ఉద్యోగులకు వారి వివాహ మరియు ఇతర ఫంక్షన్ కార్యక్రమాలకు అలాట్మెంట్ చేయుటకు సిద్ధపరచాలని అలాగే సి.ఆర్.పి క్యాంపు నందు గల పాత కమ్యూనిటీ హాల్ కూడా సివిల్ మరమ్మతుల పనులు చేసి ఉద్యోగులకు వినియోగకరంగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో జిఎం తో పాటు ఎస్.ఓ.టు జిఎం జీవి.కోటిరెడ్డి, ఎజిఎం (సివిల్) సిహెచ్.రామకృష్ణ, అధికారులు మధుకర్, రాజారాం, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ బి శ్రీనివాస్ సివిల్ సూపర్వైజర్ సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## గుడి నిర్మాణానికి రూ. 1లక్ష విరాళం అందించిన చించోడ్ అభిమాన రెడ్డి



వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా: జడ్చర్ల, రాజాపూర్ మండల్ చించోడ్ అభిమన్యు రెడ్డి నీ హైదరాబాద్ తన నివాసం లో వడ్యావత్ రాంచందర్ , జాత్రియ నాయక్ అద్వర్యం లో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. యన్మన్ గండ్ల గ్రామం తుక్యాతాండ ఆంజనేయ స్వామి గుడి నిర్మాణాకి అడిగిన వెంటనే 100.000 లక్ష అందజేశారు మరియు భవిషత్తులో మీకు ఏలాంటి సహాయం కావాలన్నా నేను ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చాడు జరిగింది. యన్మన్ గండ్ల గ్రామం తుక్యాతండా వాసులు అభిమన్యు రెడ్డి కి శాలువాతో సన్మానించి ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో ఆలయ చేర్మెన్ వి రాంచందర్ నాయక్, యూత్ అధ్యక్షులు వి.సంతోష్ నాయక్ రామ్ సింగ్ తండా మాజీ సర్పంచ్ నర్సింమా నాయక్, తరుణ్ నాయక్, శ్రీను నాయక్ ,తదితరులు పాల్గొన్నారు.

## మర్కూక్ గ్రామం ఎంపీటీసీ చైతన్య శంకర్ రెడ్డి మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

వాయిస్ టుడే జూన్ 16 (సిద్దిపేట జిల్లా ప్రతినిధి): సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం మర్కూక్ మండలం మర్కూక్ గ్రామానికి చెందిన నీలం నరసమ్మ (ముదిరాజ్) అనారోగ్యంతో బాధపడుతూ ఈరోజు ఉదయం మృతి చెందడం జరిగింది ఈ విషయం తెలుసుకున్న మర్కూక్ మండల్ ఎంపీటీసీ చైతన్య శంకర్ రెడ్డి భారతీయ జనతా పార్టీ నాయకులతో కలిసి 5000 రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పుట్ట ఆంజనేయులు పేర్ల బాబు దర్శనాలు నరేష్ లింగ భాస్కర్ పాల్గొన్నారు.

## సబ్సిడీ గ్యాస్ పథకం దుర్వినియోగం



రాయికల్(వాయిస్ టుడే)బీ రాయికల్ పట్టణంలోని ఓ కాలనిలో ఇండ్ల మధ్యలో ఓ వ్యక్తి కారులో సబ్సిడీ సిలిండర్ల నుండి గ్యాస్ ను కారులో నింపుతున్న అంశం సర్వత్ర సోషల్ మీడియాలో చర్చకు వచ్చింది , ఓ యువకుడు సోషల్ మీడియాలో పోటో తీసి పోస్ట్ పెట్టగా కొంత మంది అక్రమార్కులు సెటిల్ మెంట్ చేస్తామని,డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలిసింది కాగ కొందరు జర్నలిస్టు లపై బెదిరింపులకు దిగినట్లు చర్చా జరుగుతుంది,కాగ ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ గ్యాస్ ను వ్యాపార వాణిజ్యల నిమిత్తం వాడడం నిషిద్ధం, కాగ కారు గ్యాస్ పిల్ చేసే ప్రక్రియ అత్యంత ప్రమాదకరం ,కొద్దిగా తేడా జరిగిన ప్రమాదం జరిగి సిలిండర్ బుడ్డి పేలిపోయె ప్రమాదం ఉంది, ఇలాంటి పనులు ఊరు అవతల ఖాళీ ప్రదేశాలలో చేయవలసి ఉండగా ఉద్యేష్య పూర్వకంగా ఇండ్ల మధ్యలో చెయ్యడంతో ప్రమాదలు జరిగితే అధిక ప్రాణ నష్టం జరిగే జరుతుంది అని అట్టి కాలనీ వాసులు భయపడుతున్నారు. ఇట్టి అంశం పై సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# బెల్ట్ షాపులను తొలగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ముత్తారం గ్రామస్థులు

జూన్ 15, ముదిగొండ మండలం, ఖమ్మం జిల్లా: మండల పరిధిలోని ముత్తారం గ్రామంలో యువకులు, గ్రామస్తులు బెల్ట్ షాపులు తొలగించాలని శనివారం ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వి.పి గౌతమ్ కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ముత్తారం గ్రామస్తులందరం గత 2011 సంవత్సరం నుండి మద్యపాన నిషేధ కార్యక్రమాన్ని గ్రామస్తుల సహకారంతో 13 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. కానీ రెండు నెలల నుంచి కొంతమంది రాజకీయ దురుద్వేషంతో మా గ్రామంలోని కొంతమంది అమాయకులను చేసి బెల్ట్ షాపులను ప్రోత్సహించి ముత్తారంలో బెల్ట్ షాపులు పెట్టించారన్నారు. దీని వలన కొంతమంది గ్రామంలోని యువకులు, గ్రామస్తులు గ్రామంలో మద్యం దొరకడంతో పూర్తిగా మద్యానికి బానిసలై కుటుంబాన్ని చిన్నా భిన్నం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలు ఇంటికి బాధ్యతగా ఉండవలసిన వ్యక్తులే అందుబాటులో మద్యం ఉండటం వల్లనే మధ్యానికి బానిస అవ్వటంతో కుటుంబం చిన్న భిన్నం అవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ముదిగొండ వైన్ షాపు నుంచి ముత్తారం గ్రామానికి మద్యం





విక్రయించకుండా ఇతర మండలానికి కూడా తీసుకురాకుండా చర్యలు తీసుకొని తమ గ్రామంలో బెల్ట్ షాపులను పూర్తిగా తొలగించి తమ గ్రామానికి, పలు కుటుంబాలకి న్యాయం చేసి అండగా నిలవాలని వారు కలెక్టర్ ను కోరారు.

**వెంటనే స్పందించిన కలెక్టర్: గౌతమ్**

స్పందించిన జిల్లా కలెక్టర్ వి.పి గౌతమ్ వెంటనే ఎక్సేంజ్ సూపర్డెంట్ రాంగోపాల్ రెడ్డికి సిఫార్సు చేశారు. స్పందించిన ఎక్స్చేంజ్ సూపర్డెంట్ రాంగోపాల్ రెడ్డి అట్టి బెల్ట్ షాపులపై తక్షణమే చర్యలు తీసుకొని ముత్తారంలో బెల్ట్ షాపు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ముత్తారం గ్రామస్తులు, యువకులు, మహిళలు జిల్లా కలెక్టర్ వి.పి గౌతమ్ కుమార్, సూపర్డెంట్ రాంగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కిరణ్, జానీ, నాగేంద్రబాబు, సింహాద్రి, విజయ్ తదితరులు ఉన్నారు.



## కామారెడ్డి కలెక్టర్‌గా ఆశిష్ సంగ్వాన్ బాధ్యతల స్వీకరణ

కామారెడ్డి బ్యూరో జూన్ 15 వాయిస్ టుడే: కామారెడ్డి జిల్లా నూతన కలెక్టర్ గా 2016 బ్యాచ్ కు చెందిన ఆశిష్ సంగ్వాన్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ పనిచేస్తున్న జితేష్ వి పాటిల్ ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ గా బదిలీ చేశారు. ప్రస్తుతం నిర్మల్ జిల్లా కలెక్టర్ పనిచేస్తున్న సంగ్వాన్ స్వస్థలం హర్యానా రాష్ట్రంలోని భివాని. అమెరికా లోని జార్జియా టెక్ యూనివర్సిటీ నందు కంప్యూటర్ సైన్స్ లో మాస్టర్ డిగ్రీ చేసిన అనంతరం 2015 లో జరిగిన సివిల్ సర్వీసెస్ పరీక్షలో 12 వ రాంక్ సాధించారు. అక్టోబర్ 2023 నుండి నిర్మల్ కలెక్టర్ గా పనిచేస్తున్న సంగ్వాన్ ను కామారెడ్డి జిల్లా కలెక్టర్ గా నియమించారు. వీరి భార్య కూడా 2016 బ్యాచ్ కు చెందిన ఐ.ఏ.ఎస్. అధికారి క్రాంతి వల్లూరు. ప్రస్తుతం వీరు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ గా పనిచేస్తున్నారు. వీరికి ఒక పాప కలదు.

## హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్ల బదిలీ హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా ప్రావీణ్య





వాయిస్ టుడే, వరంగల్ జిల్లా: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా శనివారం జరిగిన ఐఏఎస్ ల బదిలీల లో భాగంగా హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. హనుమకొండ జిల్లా కలెక్టర్ గా పనిచేస్తున్న సిక్తా పట్నాయక్ నారాయణపేట్ జిల్లాకు బదిలీ అవ్వగా వరంగల్ జిల్లా కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న ప్రావీణ్య హనుమకొండ జిల్లా కలెక్టర్ గా బదిలీ అయ్యారు. వరంగల్ జిల్లా కలెక్టర్ గా సత్య శారదాదేవి ని ప్రభుత్వం నియమించింది. హనుమకొండ జిల్లా కలెక్టర్ గా పనిచేసిన సిక్తా పట్నాయక్ జిల్లా అభివృద్ధిలో తనదైన ముద్రను వేశారు.



## ఘనంగా ప్రధానోపాద్యాయులు గంటల సాంభ శివరావు పదవీ విరమణ సన్మాన కార్యక్రమం

ముదిగొండ మండలం, ఖమ్మం జిల్లా: నిరంతరం విద్యార్థినీ విద్యార్థుల విజ్ఞానాభివృద్ధికి వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తూ పిల్లలు జ్ఞాన సముపార్జనలో ఆసక్తి కనపరచుటకు భోదనలో తన దైన శైలిలో బోధనాభ్యాసన ప్రక్రియలు కావించటంలో వారి మానసిక వికాసంలో, వ్యక్తిగత, సామాజికాభివృద్ధిలో, బావి భారత పౌరులుగా తీర్చిదిద్దటంలో మరియు పాఠశాల అభివృద్ధిలో గత 26 సంవత్సరములుగా శ్రమిస్తూ తనదైన పాత్రను పోషిస్తూ, రిసోర్స్ పర్సన్గా, కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్షన్ గా సేవలు అందిస్తూ. విద్యార్థుల తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల, అధికారుల అందరి మన్ననలు పొందిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంటల సాంబశివరావు-అరుణ లకు శాలువాతో సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. అనంతరం పదవి విరమణకు విచ్చేసిన వారు మాట్లాడుతూ పదవి విరమణ ప్రతి ఉద్యోగికి సహజమని అక్షరాలు అందరికీ అందాలని తపించి పాఠశాలలను పవిత్రంగా తీర్చిదిద్ది ఉపాధ్యాయులకు విద్యార్థులకు మధ్య వారధిగా పనిచేసిన సాంభ శివరావు కు పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపి ప్రాథమిక పాఠశాల మరియు ఉన్నత పాఠశాల విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను అభినందించారు. అనంతరం వచ్చిన అతిథులచే సాంభ శివరావు ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, కుటుంబ సభ్యులు, యూనియన్ అనుబంధ సంఘాల ఉపాధ్యాయులు,విద్యార్దులు తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం జన్మదినం సందర్భంగా 5 ఫ్యాన్ల వితరణగా అందజేసిన అన్వేష్



ముదిగొండ మండలం ఖమ్మం జిల్లా : తెలంగాణ డిప్యూటీ సీఎం, మధిర శాసనసభ్యులు మల్లు భట్టి విక్రమార్క జన్మదినాన్ని పురస్కరించుకొని వల్లభి గ్రామంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకుల సమక్షంలో ఘనంగా జన్మదిన వేడుకలు జరిపారు..భట్టి జన్మదినం సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు బిచ్చాల అన్వేష్ గౌడ్ వల్లభి గ్రామంలో ఉన్న 5 అంగన్వాడి కేంద్రాలకు 5 ఫ్యాన్ లను తన సొంత ఖర్చులతో అంగన్వాడి కేంద్రాలకు ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎప్పుడు ప్రజల కోసం తపించి, రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసే భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు జరపటం సంతోషకరం అని, ఆయన ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు ఏలూరి భాస్కర్, ఎంపీటీసీ బిచ్చాల భిక్షం, కాంగ్రెస్ నాయకులు చిమ్మసర్తి ఎల్లయ్య , పిల్లుట్ల రాఘవ, సైదులు గౌడ్ , సతీష్ , నాగేశ్వరావు,రమేష్ , సంగీతరావు, చంటి , ఉపేందర్ , రామకోటి, దనమూర్తి, రాంబాబు , బజారు, కోటి , అనిల్ , వంశి , వినోద్ , రాకేష్ , వినయ్, వెంకటేష్ , యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్ కు తిర్మలాపూర్ విద్యార్థిని అక్షిత ఎంపిక



వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా: జడ్చర్ల, రాజాపూర్ మండల్ ఆర్థికంగా వెనుకబడిన, ప్రతిభావంతులైన విద్యార్థులను ఆదుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్(ఎన్ఎంఎంఎస్) పథకాన్ని అమలు చేస్తోంది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఏటా స్కాలర్షిప్ అందిస్తోంది. ఈ పథకంలో రాజపూర్ మండలం తిరుమలపూర్ గ్రామ పాఠశాలలో 9వ తరగతి విద్యనభ్యసిస్తున్న పోలేపల్లి కృష్ణ కుమార్తె పి.అక్షిత అనే విద్యార్థి ఎంపిక కావడం పట్ల ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ హర్షం చేశారు.ఈ పథకంలో ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి 12 వేల చొప్పున స్కాలర్షిప్ వస్తుందని ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు.



## ఘనంగా అపర భగీరథుని జన్మదిన వేడుకలు

**మహాదేవపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మధిర మండల సేవాదళ్ అధ్యక్షులు ఆదూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా భట్టి జన్మదిన వేడుకలు..**

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక విద్యుత్ శాఖ మాత్యులు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను మహాదేవపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మధిర మండల సేవాదళ్ అధ్యక్షులు ఆదూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు కేక్ కట్ చేసి అపర భగీరథుని జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ జన్మదిన వేడుకల్లో గ్రామశాఖ అధ్యక్షులు వరదబోయిన మురళీకృష్ణ, కనపర్తి వినోద్ బాబు, గ్యార రవి,బాడీ స వెంకటేశ్వర్లు, చేజర్ల గోపి,చేజర్ల తిరుపతయ్య, గ్యార కళ్యాణ్ నల్లపు నాగరాజు బట్ట రాజు వరదబోయిన బలరాం కోటేశ్వరరావు,పిల్లి శ్రీనివాస్, బొల్లెద్దుల జమ్మలయ్య, కరపర్తి ప్రభాకర్, చింతమాల గోపాలరావు, నల్లపు గోపాలకృష్ణ, మద్దెల కమల్, మిరియాల రామస్వామి, కలక దీపక్, మరస కట్ల రమేష్,పిల్లి కుమార్, గ్యార మోష, గ్యార రాకేష్, గ్యార గురు ప్రసాద్ కనపర్తి శివకృష్ణ మొదలగు నాయకులు మరియు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారుద.ద

# డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన మహ్మద్ అజ్గర్





**భట్టి పుట్టిన రోజున ప్రత్యేక పూజలు, కేక్ కట్ చేసి, విద్యార్దులకు చాక్లెట్లు, స్వీట్ల పంపిణీ**


ముదిగొండ మండలం, ఖమ్మం జిల్లా : తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క పుట్టిన రోజు వేడుకను శనివారం న్యూ లక్ష్మీపురంలో ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని న్యూ లక్ష్మీపురం గ్రామంలో మాజీ సర్పంచ్ మరియు జిల్లా కాంగ్రెస్ మైనార్టీ నాయకులు మహ్మద్ అజ్గర్ అధ్వర్యంలో ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు చాక్లెట్లు, స్వీట్లు పంచి పెట్టి అనంతరం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలను ఒక పండుగ గా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు భట్టి చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా నాడు ప్రజల ద్వారా స్వయంగా తెలుసుకొన్న సమస్యలే నేడు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలని, అ పథకాలే నేడు ప్రతి పేదవాడికి చేరుతుందన్నారు. నిత్యం ప్రజల పక్షాన పోరాడే మనస్సు ఉన్న నాయకులు భట్టి అని అటువంటి నాయకులు నిండు నూరేళ్ళు సుఖసంతోషాలతో జీవించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ టిపిసిసి సభ్యులు రాయల నాగేశ్వరరావు, మండల కాంగ్రెస్ నాయకులు కొమ్మినేని రమేష్ బాబు, మండల సేవాదళ్ అద్యక్షులు జెట్టి వినోద్ కుమార్, మాజీ సర్పంచ్ వాకదాని కన్నయ్య, కనపర్తి మోహన్ రావు, న్యూ లక్ష్మీపురం గ్రామ శాఖ అధ్యక్షులు పల్లెపొంగు రమేష్, చెరుకుపల్లి రాంబాబు, పోతురాజు పురుషోత్తం, వార్డు మెంబర్ మార్తి వీరయ్య, చెన్నారావు,చిలకల విజేత రామకృష్ణ, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



## చెస్ ఆటలో విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా జూన్ 14: పాలమూరు :చెస్ లో జాతీయ స్థాయిలో సత్తా చాటాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చెగు వేరా 96 వ జయంతిని పురస్కరించుకొని వి కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ చెస్ టోర్నమెంట్ విజేతలకు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన బహుమతులను మరియు ప్రశంసా పత్రాలను అందించి విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో వి కేర్ ఫౌండేషన్ నిర్వాహకులు యం.ప్రవీణ్ కుమార్, యం. కిరణ్, గోపాలకృష్ణ, కుమార్, దినేష్ , రామకృష్ణ చెస్ క్రీడాకారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
ఆదివారం, 16 జూన్ 2024




# ఆ వసూళ్లు ఆనందాన్నిస్తున్నాయి

యశ్ హీరోగా కెవి.రాజు తెరకెక్కించిన అనువాద చిత్రం 'రాజధాని రౌడీ'. ఈ సినిమా ఇటీవల తెలుగులో విడుదలైన నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. "మా చిత్రానికి అన్ని థియేటర్స్ నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. హైదరాబాద్‌తో పాటు బీ, సీ సెంటర్లలో వసూళ్లు బాగున్నాయి. మేము పెట్టిన పెట్టుబడికి వస్తున్న వసూళ్లు చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. రాబోయే రోజుల్లో దీనికి ప్రేక్షకుల నుంచి మరింత ఆదరణ దక్కుతుందని ఆశిస్తున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో టి.ప్రసన్న కుమార్, సంజీవి, తుమ్మలపల్లి రామసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టులో ఇస్మార్ట్

రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. ఇది 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. హీరోయిన్‌గా కావ్య థాపర్ నటిస్తున్నారు. సంజయ్‌దత్ కీలక పాత్ర పోషిస్తున్నారు. పూరి కనెక్ట్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మి కౌర్ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: సామ్ కె నాయుడు, జియాని జియాన్నెలి, సంగీతం: మణిశర్మ.






# సింగమ్ మళ్లీ వస్తున్నా... ఆలస్యంగానే!




అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో.. రోహిత్ శెట్టి తెరకెక్కిస్తున్న చిత్రం 'సింగమ్ అగైన్'. అక్షయ్ కుమార్, అర్జున్ కపూర్, రణ్‌వీర్ సింగ్, కరీనా కపూర్, దీపికా పదుకొణె తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. దీన్ని ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా దీపావళికి రాబోతున్నట్లు తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టింది చిత్రబృందం. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ.."అనుకున్న సమయానికి సినిమా వస్తుందన్న నమ్మకం మాకు లేదు. అందుకే తొందర పడటం లేదు. ఆలస్యమైనా ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా దీన్ని తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నాము. ఈ ఏడాది దీపావళికి విడుదల చేయాలని నిర్ణయించుకున్నామ"ని చెప్పుకొచ్చారు.

# కొంచెం టెన్షన్‌గా ఉంది

దీపికా పదుకొనే ప్రస్తుతం పూర్తి విశ్రాంతిలో ఉంది. ఆరోగ్యవంతమైన బిడ్డను ప్రసవించడానికి ఎన్ని జాగ్రత్తలు తీసుకోవాలో అన్ని జాగ్రత్తలూ తీసుకుంటూ ఓ కొత్త జీవితాన్ని గడుపుతున్నది. ఇటీవల ఆన్‌లైన్‌లో తన అభిమానులతో ఇంటరాక్ట్ అయిన దీపిక.. తన ప్రెగ్నెన్సీ లైఫ్ గురించి ఆసక్తికరంగా మాట్లాడింది. 'ఇన్నాళ్లూ బరువు పెరగకుండా జాగ్రత్తలు తీసుకునేదాన్ని. ఇష్టమైన ఫుడ్‌ని కూడా అవైడ్ చేసేదాన్ని. ఇప్పుడు కోరింది తింటున్నాను. నేనెంత తింటే నా బేబీకి అంత మంచిదని డాక్టర్ చెప్పారు. అయితే బయటి ఫుడ్ మాత్రం తినడంలేదు. చక్కగా ఇంట్లో చేసుకునే తింటున్నా. బోర్ కొడితే బయటకెళు_న్నాను. అయితే పక్కన రణ్‌వీర్ ఉండాల్సిందే. మా అమ్మానాన్న వచ్చి వెళ్తున్నారు. మొన్నామధ్య రణ్‌వీర్ పేరెంట్స్ కూడా రెండ్రోజులుండి వెళ్లారు. కుటుంబసభ్యులతో గడపడం ఆనందంగా ఉంది. నేను ఏ మాత్రం ఆందోళన చెందకుండా రణ్‌వీర్ దగ్గరుండి చూసుకుంటున్నాడు. డెలివరీ సెప్టెంబర్‌లో ఉంటుందని డాక్టర్ చెప్పారు. కొంచెం టెన్షన్‌గా ఉంది' అంటూ చెప్పుకొచ్చింది దీపికా పదుకొనే.



# టాక్సిక్ కోసం బరిలోకి నయనతార

'కేజీఎఫ్' సిరీస్ విజయాల తర్వాత యశ్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్'. గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాని కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. నయనతార, హ్యూమా ఖురేషి ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ కోసం యశ్‌తో కలిసి నయన్ సెట్లోకి అడుగు పెట్టినట్లు సమాచారం. ప్రస్తుతం వీళ్లిద్దరిపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక దీని తర్వాత రెండో షెడ్యూల్‌ను యూకేలో చిత్రీకరించనున్నారని తెలిసింది. ఈ సినిమాలో సింహభాగం అక్కడే చిత్రీకరణ చేసుకోనుందని.. దీనికోసం దాదాపు 150రోజులకు పైగా సుదీర్ఘ షెడ్యూల్‌ను ప్లాన్ చేస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. విజయవంతమైన ఆంగ్ల సిరీస్ 'పీకీ బ్లైండర్స్' ప్రేరణతో గీతూ ఈ కథను సిద్ధం చేసినట్లు ప్రచారం వినిపిస్తోంది. ఈ చిత్రంలో యశ్ శక్తిమంతమైన గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు. ఆయనకు జోడీగా కియారా నటించనున్నట్లు తెలిసింది. ఇది వచ్చే ఏడాది ఏప్రిల్ 10న విడుదల కానుంది.



# గరం గరం యముడు

"మామూలుగా నాటు అయినా నీటు.. ఎరగడు తడబాటు. మాసు..క్లాసుల మధ్యన ఊగుట వీడికి అలవాటు" అంటూ తన వ్యక్తిత్వాన్ని పరిచయం చేస్తున్నాడు సూర్య. మరి అతనెవరు? తన కథేంటి? తెలియాలంటే 'సరిపోదా శనివారం' చూడాల్సిందే. నాని కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని వివేక్ ఆత్రేయ తెరకెక్కిస్తున్నారు. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ప్రియాంక అరుల్ మోహన్ కథానాయిక. ఎస్.జె.సూర్య, సాయికుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టు 29న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం ఈ చిత్ర తొలి గీతాన్ని విడుదల చేశారు. "గరం గరం యముడయో.. సహనాల శివుడయో.." అంటూ సాగిన ఈ పాటతో సినిమాలో సూర్యగా నాని పాత్ర వ్యక్తిత్వాన్ని.. గుణ గణాల్ని ఆసక్తికరంగా పరిచయం చేశారు. దీనికి జేక్స్ బిజోయ్ స్వరాలు సమకూర్చగా.. సనాపతి భరద్వాజ పాత్రుడు సాహిత్యమందించారు. విశాల్ దద్లాని ఆలపించారు. వినూత్నమైన కథతో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ చిత్రం ప్రస్తుతం ముగింపు దశలో ఉంది. ఈ సినిమాకి కూర్పు: కార్తీక శ్రీనివాస్, ఛాయాగ్రహణం: జి.మురళి.

# సెట్టవుతుందా పెయిరు..



రాజ్‌తరుణ్ కథానాయకుడిగా జె.శివసాయి వర్ధన్ తెరకెక్కించిన చిత్రం 'భలే ఉన్నాడే'. ఎన్.వి.కిరణ్ కుమార్ నిర్మించారు. మనీషా కంద్కూర్ కథానాయిక. సింగీతం శ్రీనివాస్, అభిరామి, వీటీవీ గణేశ్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమాలోని రెండో పాటను శనివారం విడుదల చేశారు. "సెట్టవుతుందా పెయిరు.. రైటో రాంగో వీరు.. మిస్టరి వీడేదెప్పుడో" అంటూ సాగిన ఈ పాటకు శేఖర్ చంద్ర స్వరాలు సమకూర్చగా.. కృష్ణకాంత్ సాహిత్యమందించారు. కపిల్ కపిలన్ ఆలపించారు.



# 'ఏ'.. ఈతరం ప్రేక్షకుల్నీ షాక్‌కు గురిచేస్తుంది

ఉపేంద్ర కథానాయకుడిగా నటిస్తూ.. స్వయంగా తెరకెక్కించిన చిత్రం 'ఏ'. ఈ సినిమా ఈ నెల 21న తెలుగు రాష్ట్రాల్లో రీరిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో, దర్శకుడు ఉపేంద్ర మాట్లాడుతూ.. "ఇది నా జీవితంలో మర్చిపోలేని సినిమా. 26 ఏళ్ల క్రితం ఈ చిత్రం విడుదలవుతున్నప్పుడు ఎంత ఉత్సాహంగా ఎదురు చూశానో.. ఇప్పుడూ అదే ఉత్సాహంతో ఉన్నా. ఈ సినిమాని చూసి ఈతరం ప్రేక్షకులు కూడా షాక్ అవుతార"న్నారు. "ఈ చిత్రం రీరిలీజ్ సందర్భంగా ఒక బైట్ ఇవ్వండని ఉపేంద్రను అడిగితే.. ఏకంగా హైదరాబాద్‌కు వచ్చి మాట్లాడతానని చెప్పి మంచితనం చాటుకున్నారు" అన్నారు నిర్మాత సైదులు. ఈ కార్యక్రమంలో లింగం తదితరులు పాల్గొన్నారు.